# వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

శనివారం 23, మే 2026 | 16 పేజీలు






## రెండవ రోజుకు చేరిన అంత్య పుష్కర

# సంబరాలు..

మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త అంత్య పుష్కరాల రెండవ రోజున నదీ తీరాలు భక్తుల కోలాహలంతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర నదీ స్నానాలు ఆచరించి, సంప్రదాయ మునకలు వేశారు. పూర్వీకుల ఆత్మశాంతి కోసం ఘాట్ల వద్ద పెద్ద ఎత్తున పిండ ప్రదానాలు, తర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. నదీ మాతకు ప్రత్యేక హారతులు, దీపారాధనలు, పూజా కార్యక్రమాలతో తీర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అంత్య పుష్కర వేడుకలు రెండవ రోజు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో కొనసాగాయి. పుష్కరాల ముగింపు ఘట్టం కావడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు నదీ తీరాలకు భారీగా తరలివచ్చారు.

2లో



### కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు...

16లో

సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై గవర్నర్ హర్షం...

పట్టు వస్త్రాల తయారీని వివరించిన మంత్రి శ్రీధర్ బాబు...

నదీ తీరాలకు భక్తజన నదీ స్నానాలు... పిండ ప్రదానాలతో కిక్కిరిసిన ఘాట్లు.. ఆధ్యాత్మిక శోభతో పులకించిన పుణ్యక్షేత్రాలు...

---

భక్తులు లేక

## వెలవెలబోతున్న కాళేశ్వరం...!

పగబట్టిన సూర్యుడు..

వాతావరణ శాఖ హెచ్చరికలు...

2లో



ప్రాణహిత అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం క్షేత్రంలో ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించింది. తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుధ్య ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రత్యేక ఘాట్లు, విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోంది.

---

ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, మే22: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క తెలిపారు. జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు చేపడతామని వెల్లడించారు.అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలి.




జూన్ 2 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు,కొత్త పెన్షన్లు

# కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు...

### సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై గవర్నర్ హర్షం...

### పట్టు వస్త్రాల తయారీని వివరించిన మంత్రి శ్రీధర్ బాబు...

మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు శుక్రవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గురువారం రాత్రి వీరు పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానాన్ని ఆచరించారు. అనంతరం సరస్వతి ఘాట్ వద్ద కాశీ పండితులు నిర్వహించిన సరస్వతి నవరత్న మాలా హారతిని, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను గవర్నర్ దంపతులు ఆసక్తిగా వీక్షించారు. ముక్తీశ్వర స్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ పరివట్టం, పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గవర్నర్ దంపతులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు వారికి వేదాశీర్వచనం అందించి, శ్వేత వస్త్రాలు, లడ్డు ప్రసాదం, చక్కెర పొంగలితో పాటు అమ్మవారి జ్ఞాపికను బహుకరించారు. ఆలయ ప్రాంగణంలోని స్టాళ్లలో ఏర్పాటు చేసిన దసలి పట్టు వస్త్రాల స్టాలును గవర్నర్ దంపతులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టస్సార్ పట్టు వస్త్రాల తయారీ విధానాన్ని, వాటి ప్రత్యేకతను గవర్నర్‌కు స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సరస్వతి అంత్య పుష్కరాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని కొనియాడారు. సరస్వతి ఘాట్ వద్ద కాశీ పండితులు ఇచ్చిన నవరత్న మాలా హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతికి, ఆధునికతకు అద్దం పడుతున్నాయని ప్రశంసించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు, అద్భుతమైన ఏర్పాట్లు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భక్తులందరూ పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి, స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని గవర్నర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఇతర ఉన్నతాధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## భక్తులు లేక

# వెలవెలబోతున్న కాళేశ్వరం...!

### పగబట్టిన సూర్యుడు.. వాతావరణ శాఖ హెచ్చరికలు...

ప్రభాతవార్త, కాళేశ్వరం, పుష్కర బృందం : ప్రాణహిత అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం క్షేత్రంలో ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించింది. తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుధ్య ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రత్యేక ఘాట్లు, విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోంది. ప్రభుత్వ సేవలు అభినందనీయంగా ఉన్నప్పటికీ, తీవ్ర ఎండలు మరియు వేడి గాలుల కారణంగా భక్తుల రాక ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు.తెలంగాణ వాతావరణ శాఖ రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఎండలపై హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలకు అప్రమత్త సందేశాలు పంపిస్తోంది. "మీ ప్రాంతంలో తీవ్ర ఎండలు, వేడి గాలులు వీచే అవకాశం ఉంది. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దు. తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోండి. అస్వస్థతగా ఉంటే వెంటనే వైద్య సహాయం పొందండి" అంటూ సూచనలు చేస్తోంది.ఈ హెచ్చరికల ప్రభావం పుష్కరాలపై స్పష్టంగా కనిపిస్తోంది. మధ్యాహ్న సమయంలో ఘాట్లు దాదాపు వెలవెలబోతుండగా, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో మాత్రమే కొద్ది మంది భక్తులు దర్శనమిస్తున్నారు. మండుతున్న ఎండలు, ఉక్కపోత కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలు ప్రయాణాలకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే అధికారులు మాత్రం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య సిబ్బంది, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో సేవలు కొనసాగిస్తున్నారని అధికారులు తెలిపారు.





## వడగాల్పుల వేళ...

# వరి కొయ్యలకు నిప్పులు పెట్టడమా!

### నియంత్రణ చర్యలు చేపట్టిన అధికారులు

### ఎండలకు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ శాఖ ప్రచారం

### వరి కొయ్యలను తగలబెట్టకుండా రైతులకు అవగాహన

### ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

### బాధ్యులపై కేసుల నమోదుకు వెనకాడేది లేదు

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త :** తీవ్ర ఎండలు, వడగాల్పులు వీస్తున్న నేపథ్యంలో వ్యవసాయ భూముల్లోని వరి కొయ్యలకు నిప్పులు పెట్టడం తగదని అధికారులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వరి కొయ్యలకు నిప్పంటించి తగలబెడితే జరిగే ప్రమాదాలు నష్టాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఒకవైపు పోలీస్ శాఖ అధికారులు అరవైపు అధికారులు ప్రచారం చేపట్టారు. నల్లగొండ జిల్లాలో వరి కొయ్యలను నిప్పు అంటించే సమయంలో ఒక రైతు మృతి చెందడం జరిగింది. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వరి కొయ్యల నిప్పు తగలబడుతూ అంటుకోవడంతో ధాన్యం బుగ్గిపాలయింది. దీంతో అప్రమత్తమైన అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామస్థాయిలో రైతులతో సంభాషణ చేస్తూ వరి కొయ్యలకు నిప్పు పెడితే జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నష్టాలకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు పోలీస్ శాఖ వెనకాడటం లేదు. ఉమ్మడి జిల్లాలో పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. వరి కొయ్యలను కాల్చకుండా భూసారం కాపాడుకోవాలని సూచిస్తున్నారు. వాన పాములు, సూక్ష్మజీవులు మంటలు నేపథ్యంలో నశిస్తాయి అన్నారు. ఎక్కువ ఎరువులు వేయాల్సి వస్తుందని దీంతో రైతుల పెట్టుబడి పెరుగుతుంది. గాలి కాలుష్యం చెందుతుంది. రహదారులపై పొగ కమ్ముకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. పర్యావరణానికి




అనుకూలమైన పద్ధతులను పాటించాలని అధికారులు రైతులకు గ్రామా ల్లో అవగాహన కల్పిస్తున్నారు. తీవ్ర ఎండలకు బయటకు వెళ్ళవద్దని జిల్లా పోలీస్ శాఖ అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటికి రావద్దని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు ఫ్లెక్సీ ల పై వివరాలను రాసి ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో శుక్రవారం 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పర్యావరణ రక్షణ నిమిత్తం పంట వ్యర్థాలు కాల్చకుండా ఉండాలని ఎస్పి అన్నారు. వరి కొయ్యలు తగలబెడుతూ ఇతరులకు నష్టం కలిగిస్తే అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అన్నారు. వ్యవసాయ భూముల్లో మంటలకు విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని రైతులకు ఎస్పీ సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వరి కొయ్యలకు నిప్పులు పెట్టకుండా పోలీస్ శాఖ అధికారులు చైతన్య పరుస్తున్నారు. జిల్లాలోని పలుచోట్ల వరి కొయ్యలకు నిప్పులు పెడుతున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాటిని నియంత్రించే చర్యలపై పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు ఫోకస్ పెట్టారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఎంతో సీరియస్ గా ఉంది. దీంతో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తమయ్యారు.



## ప్రజా పాలనతో

# ప్రతి ఇంటికీ సంక్షేమం : మంత్రి సీతక్క

### జూన్ 2 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు,కొత్త పెన్షన్లు

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, మే22:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. జూన్ రెండవ తేదీ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ల మంజూరు చేపడతామని వెల్లడించారు.అర్హుల జాబితా వెంటనే సిద్ధం చేయాలి.ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పథకాల అర్హుల జాబితాను శాఖల వారీగా వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలతో మమేకమై పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, వేడి పాలు.ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తామని మంత్రి తెలిపారు. రోజు విడిచి రోజు రాగి జావ, వేడి పాలు అందిస్తామని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరిస్తామని, దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలుపై వివరణ.రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డుల మంజూరు తదితర పథకాల అమలును మంత్రి వివరించారు. ములుగు జిల్లాకి అత్యధిక ఇందిరమ్మ ఇండ్లు రాష్ట్రంలోనే ములుగు నియోజకవర్గానికి అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో 38 వేలకుపైగా కొత్త పెన్షన్లు జూన్ 2న అందజేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్యలు లేవని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.యువతకు మెగా జాబ్ మేళా.స్థానిక నిరుద్యోగ యువత కోసం 80 నుంచి 100 ప్రభుత్వ, ప్రైవేట్ బహుళ జాతి సంస్థలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. మహిళా సంఘాలకు కోట్ల రూపాయల చెక్కులు. స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పలువురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు.

# ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

### గణపురం, మే 22,ప్రభాత వార్త

మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని కారణాలతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ధరావత్ రాజుకు చెందిన పెంకుటిల్లు పూర్తిగా కాలిబూడిదైంది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది ట్యాంకర్లతో నీటిని తెచ్చి మంటలను ఆర్పివేశారు. ఉన్న ఇల్లు పూర్తిగా కాలిపోయింది, వచ్చేది వర్షాకాలం ఇప్పుడు పిల్లలతో ఎక్కడ ఉండాలో తెలియటం లేదంటూ రాజు భార్య పిల్లలు రోదిస్తుంటే చుట్టూ పక్క ఉన్న జనం కూడా బాధతో ఏడవటం జరిగింది, ఊరు జనం అందరూ కూడా రాజుకు వెంటనే ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు స్పందించి ఆదుకోవాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.



# జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

**నల్లబెల్లి, మే 22, ప్రభాతవార్త**

జూన్. 3.4.5. తేదీలలో నల్లబెల్లి మండల కేంద్రంలో జరిగే సిపిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి కోరారు. శుక్రవారం ఆ పార్టీ మండల స్థాయి సమావేశం మండల నాయకులు పరికి కోర్నెల్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కుమారస్వామి మండల పార్టీ కార్యదర్శి బట్టు సాంబయ్య లు మాట్లాడుతూ. ప్రస్తుత భారత దేశ రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మెజార్టీ ప్రజలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు వ్యవసాయ కార్మికులు రైతులు అసంఘటిత రంగ కార్మికులు చిన్న మధ్యతరహా వ్యాపారులు తీవ్ర ఆర్థిక సామాజిక



ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు కారణంగా కేంద్రం చేసిన అప్పులు 2 లక్షల కోట్లు,రాష్ట్రం చేసిన అప్పు 10 లక్షల కోట్లకు చేరువలో ఉందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ అప్పులు దుబారా కారణంగా నిత్యవసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని వారు దుయ్యబట్టారు. యువతకు ఉపాధి కల్పన కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేసే కుట్రలో పన్నుతుందని వారు పేర్కొన్నారు. పాఠశాలలో చరిత్రకు సంబంధించిన సిలబస్ లు మార్చి మూఢత్వానికి సంబంధించిన పాటలను నేర్పుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలను సమీకరించడానికి జిల్లా శిక్షణ తరగతులలో జిల్లా నాయకులు 200 మంది వరకు పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు ఈ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు మామిండ్ల పెద్ద ఐలయ్య కందిక రమేష్ కడియాల క్రాంతి కుమార్. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మద్రి రమేష్ నాయకులు ఒడెల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం

**నల్లబెల్లి, మే 22, ప్రభాతవార్త**

ఇందిరమ్మ రాజ్యంతో ఇంటింటా సౌభాగ్యం వెదజిల్లుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్ పేర్కొన్నారు. మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన ఎలకపల్లి సరోజన కు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆ గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు శుక్రవారం నూతనంగా ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్ ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలని నిజం



చేయడమే ప్రజా పాలనలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన గుర్తు చేశారు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరెడ్డి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. అనం3లియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు అజ్మీర తిరుపతి నాయక్, క్లస్టర్ మామిళ్ల రాజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కరుణాకర్, అంబరగొండ రాజు, కొమురయ్య గాది మల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ గద్దల సురేష్, మాజీ ఉపసర్పంచి బైకాని శివకోటి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లకిడే శివాజీ, ఎలకపల్ల, చింటూ, రాజు, అజ్మీర రాజేందర్, వక్కల శివకుమార్, గంగారపు అశోక్, పలకల ఈశ్వర్ రెడ్డి,గద్దల సుభాష్, మంద రాజేష్, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోనేరులో పడి అర్చక తండ్రీ కొడుకుల మృతి

**- బండగుట్ట లక్ష్మీనరసింహస్వామి**

**ఆలయంలో ఘటనతో కలకలం**

**లింగాలఘణపురం, మే 22 ప్రభాతవార్త :**

జనగామ జిల్లాలో విషాదఘటన చోటుచేసుకుంది. లింగాలగణపురంమండలం బండ్లగూడెం పరిధిలోని బండగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరయోరు లక్ష్మీనరసింహాచార్యులు, ఆయన కుమారుడు పవన్‌కుమార్ ఆచార్యులు ఆలయ కోనేరులో మృతదేహాలుగా కనిపించడం స్థానికంగా తీవ్ర కలకలంరేపింది. శుక్రవారం



ఉదయం ఆలయకోనేరులో ఇద్దరి మృతదేహాలు తేలియాడుతున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను కోనేరులో నుంచి వెలికితీశారు. తండ్రీకొడుకుల మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు కోనేరులో పడ్డారా లేక మరేదైనా కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషాదఘటనతో ఆలయ పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక భక్తులు, గ్రామస్తులు తీవ్రదిగ్భ్రాంతికి గురయ్యారు.

# బండనాగారం గ్రామానికి నూతన ఆర్టీసీ బస్సుసౌకర్యం

**బచ్చన్నపేట, మే 22 ప్రభాతవార్త :**

జనగామ జిల్లా బండనాగారం గ్రామప్రజలకు ఆర్టీసీ నూతన బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఉదయం 5.30గంటలకు జనగామ - బండనాగారం - చేర్యాల- దుద్దెడ క్రాస్ మార్గంగా సికింద్రాబాద్ వరకు నూతన బస్సు సర్వీస్ ప్రారంభించారు. తిరిగి మధ్యాహ్నం 3గంటలకు సికింద్రాబాద్ నుంచి బండనాగారం మీదుగా జనగామకు బస్సు నడవనున్నట్లు తెలిపారు. జనగామ నుంచి బండనాగారం గ్రామంమీదుగా జేబీఎస్ వరకు బస్సు సౌకర్యం ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా గ్రామపెద్దలు, యువకులు,



ప్రజాప్రతినిధులు కలిసి బస్సుకు ఘనస్వాగతం పలికారు. గ్రామప్రజలు మాట్లాడుతూ నూతన బస్సు సేవవల్ల జనగామ, హైదరాబాద్ జేబీఎస్‌కు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవర్గాలకు ఈ బస్సు ఎంతో ఉపయోగకరంగా ఉండనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, మండల సర్పంచులఫోరం అధ్యక్షులు ఇజ్జగిరి రాములు, ఉపసర్పంచ్ మల్లయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి.

**వెంకటాపురం ప్రభాత వార్త, మే 22 :**



వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన రేగ పిడుగయ్య (62), కూలీ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 21న ఉదయం కుటుంబ సభ్యులను చూడటానికి బర్రెబొంద గ్రామానికి వెళ్లిన ఆయన, అనంతరం అక్కడి నుంచి పాలెం గ్రామానికి నడుచుకుంటూ బయలుదేరాడు. ఈ క్రమంలో ఆలుబాక గ్రామ శివారులో వెంకటాపురం వైపు వెళ్లే రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమార్తె వాసం పార్వతి ఫిర్యాదు మేరకు వెంకటాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

**నెల్లికుదురు మే 22 ప్రభాతవార్త :**



బైక్ అదుపుతప్పి కింద పడిపోయి బట్టల వ్యాపారి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది శుక్రవారం స్థానిక ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు గ్రామానికి చెందిన ఎలగం సదానందం వృత్తిరీత్యా బట్టల వ్యాపారి ఈనెల 18న మండలంలో తన బండికి ఇరువైపులా బట్టల మూటలు తగిలించుకొని వెళుతుండగా నెల్లికుదురు శివారు మామిడి తోట వద్ద రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు దీనితో తలకు బలమైన గాయం కాగా శరీరంలోని ఇతర భాగాలకు కూడా గాయాలు అయ్యాయి చికిత్స నిమిత్తం స్థానికులు అతన్ని వెంటనే అంబులెన్స్ లో తొర్రూరు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తుండగా శుక్రవారం ఉదయం అతను మృతి చెందినట్లు తెలిపారు మృతుని అల్లుడు పారిపల్లి శ్రావణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు కాగా మృతునికి భార్య కొడుకు కూతురు ఉన్నారు

### వైద్యసేవలు అందించడం అభినందనీయం

**నర్మెట, మే 22 ప్రభాతవార్త :**



వ రా ం ్ ు వ యూ ల ప్రాంతాలలోని పేదప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ పల్లారాజేశ్వర్ రెడ్డి అన్నారు. మచ్చుపహాడ్‌లో గ్రా మ ు ప ం చా య ు తీ ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్‌హోప్ హైదరాబాద్ వారు ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ లింగాల హైమా రమేష్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. శిబిరంలో పాల్గొన్న 360మందికి పలురకాల వైద్యపరీక్షలతోపాటు ఎముకలు, కంటిపరీక్షలు, నరాల సంబంధిత, బిపి, షుగర్‌పరీక్షలు నిర్వహించి 75మందికి కంటి అద్దాలు, వందమందికి పైగా మందులు, మిగిలినవారికి ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్లు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఉత్తేజ్, హిమబిందు హేమానంద్, సురేష్, ఉపసర్పంచి ఇనుగాల రాజిరెడ్డి, వార్డు సభ్యులు గుండేటి రామచందర్, కుమారస్వామి, జయమ్మ, మాధవి, సంస్థ ప్రతినిధులు సామెల్ జయరాజ్, ఇమాన్యుయల్, స్వామి, మారి సమస్త,సభ్యులు, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.




# పుష్కరాలను నమ్ముకున్న చిరు వ్యాపారులు.. చేతికందని ఆదాయం...!

**వేలకు వేలు పెట్టుబడి...**

**భక్తుల్లేక ఎండకు పాడవుతున్న సరుకు...?**

ప్రభాతవార్త, కాళేశ్వరం

పుష్కరబృందం సరస్వతి అంత్య పుష్కరాలు చిరు వ్యాపారులకు వరంగా మారుతాయని ఆశ. లక్షలాది మంది భక్తులు వస్తారు, కాస్తంత లాభం వస్తుందని వేల రూపాయలు పెట్టుబడి పెట్టి కాళేశ్వరం గట్టున దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ ఈసారి పుష్కరాలు వారికి కన్నీళ్లను మిగిల్చాయి. భక్తుల రద్దీ లేకపోవడంతో తెచ్చుకున్న సామగ్రి మొత్తం ఎండకు పాడైపోతుండగా, చూస్తూ ఉండిపోయే దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పూజా సామగ్రి, కొబ్బరికాయలు, పూలు, అగరొత్తులు,



చల్లని పానీయాలు, టిఫిన్లు, ఆట వస్తువులు... ఇలా చిన్న చిన్న దుకాణాలు పెట్టిన వ్యాపారులు వేల రూపాయల పెట్టుబడి పెట్టారు. అప్పులు చేసి సరుకు తెచ్చారు. పుష్కరాల్లో కనీసం పెట్టుబడి తిరిగి వస్తుందని ఆశించారు. కానీ వాస్తవం మరోలా ఉంది. ఊహించినంత మంది భక్తులు రాకపోవడంతో రోజుకు వంద, రెండు వందల రూపాయల అమ్మకాలు కూడా కావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఎండ వేడి తీవ్రంగా ఉండటంతో పండ్లు, కొబ్బరికాయలు, పూలు, పానీయాలు త్వరగా పాడైపోతున్నాయి. ఉదయం తెచ్చిన పూలు సాయంత్రానికి వాడిపోతున్నాయి. కొందరు తెచ్చిన ఐస్‌క్రీములు కరెంట్ సమస్య వల్ల కరిగిపోయాయి."వేల రూపాయలు పెట్టి సరుకు తెచ్చుకున్నా. రెండు రోజుల నుంచి అమ్ముడు పోలేదు. ఇప్పుడు అంతా ఎండకు ఎండిపోతోంది. పెట్టిన డబ్బు తిరిగి వస్తుందో లేదో తెలియదు" అని వ్యాపారులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

## కాటారంలో ధాన్యం నిల్వ గోడౌన్ల పరిశీలన

**ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు**

**రైతులు ఆందోళన చెందవద్దని ఆర్డీఓ రవీందర్ భరోసా**

కాటారం, మే 22, ప్రభాతవార్త



కాటారం మండలంలో ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని (వడ్లను) భద్రపరిచేందుకు స్థానిక గోడౌన్లను అధికారులు ముమ్మరంగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యానికి సరిపడా ప్రభుత్వ గోడౌన్ల కొరత ఏర్పడటంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. రైతుల ధాన్యం నిల్వలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం కాటారం ఆర్డీఓ దొనగంటి రవీందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌లు మండలంలోని ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులను సందర్శించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని రుద్రా జిన్నింగ్ మిల్, మీనాక్షి కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్ రెండు జిన్నింగ్ మిల్లులకు చెందిన గోడౌన్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి నిల్వ సామర్థ్యం, వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రవీందర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యానికి సరిపడా నిల్వ స్థలాలను గుర్తించామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో వద్ద తూకాలను (కాంటాలను) వెంటనే, త్వరితగతిన పూర్తి చేయాలని పీఏసీఎస్ సెంటర్ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే గోడౌన్లకు తరలించడానికి వీలుగా తగినన్ని లారీలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పరిశీలన కార్యక్రమంలో కాటారం తాసిల్దార్ నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ ఎర్ల సతీష్, డీసీసీ జిల్లా అధికార ప్రతినిధి సమ్మయ్యతో పాటు పలువురు స్థానిక నాయకులు, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం రైతుల్లో హర్షం

**మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన యువ రైతు కోల మహేష్**

**ఐటీ శాఖ మంత్రి ఆదేశాలతో వేగవంతమైన ధాన్యపు కొనుగోళ్లు**

**ఇబ్బందులు తొలగడంతో అన్నదాతల సంతోషం**

మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త



రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత సజావుగా నిర్వహించాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. మంత్రి తీసుకున్న ఈ చొరవ పట్ల మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామ యువ రైతు కోల మహేష్ తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదన్న మంత్రి ఆదేశాల మేరకు స్థానిక యంత్రాంగం తక్షణమే స్పందించింది. అధికారులు యుద్ధప్రతిపదికన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని రకాల తగు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కాళేశ్వరం పరిసర ప్రాంతాల రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వేగంగా సేకరించి, అక్కడికక్కడే లారీల ద్వారా రైస్ మిల్లర్లకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన తిప్పలు తప్పాయని యువ రైతు కోల మహేష్ పేర్కొన్నారు. తమ సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కారం లభించేలా చేసినందుకు ఆయన మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త



ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. శుక్రవారం కాళేశ్వరంలో మెగా విశ్రాంతి భవనంలో ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి తక్షణ చెల్లింపులు జరిగేలా ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించి పారదర్శకంగా వ్యవహరించాలని, ఆర్డీవో పర్యవేక్షణలో కొనుగోళ్లు జరగాలని సూచించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కాటారం ఆర్డీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాల్లో పరిశుభ్రతకు ముందస్తు పీఠం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపు**

**భక్తులు వ్యర్థాలను డస్ట్‌బిన్లలోనే వేయాలి**

**ప్లాస్టిక్ రహిత పుష్కరాలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి**

మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త



పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా ఘాట్లు, పరిసర ప్రాంతాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను, భక్తులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించి, పారిశుద్ధ్య పనులపై పలు సూచనలు చేశారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో విచ్చేసే భక్తులు తాము వినియోగించిన వ్యర్థాలను, పూజా సామగ్రిని ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని కలెక్టర్ కోరారు. గ్రామ పంచాయతీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్స్ (చెత్తబుట్టల) లోనే వ్యర్థాలను వేసి, పుణ్యక్షేత్రాల పవిత్రతను కాపాడాలని సూచించారు. పుష్కర ఘాట్లు, వాటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం కేవలం అధికారుల పని మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో జిల్లా యంత్రాంగానికి భక్తులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన అభ్యర్థించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ పుష్కరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులకు ప్రత్యామ్నాయాలను వాడుతూ, పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సరస్వతి అంత్య పుష్కరాలను పర్యావరణహితంగా, విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షి ంచారు.

# పుష్కర సౌరభంలో కొనసాగిన సాంస్కృతిక వైభవం

మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త



సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో ఆధ్యాత్మిక ఉత్సాహం, సాంస్కృతిక వైభవం నిండుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పుష్కర ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలపై సాంస్కృతి సారథి కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, జానపద గీతాలు, ఆధ్యాత్మికానందాన్ని అందించాయి. ముఖ్యంగా సరస్వతి అమ్మవారి మహిమను, నదీ సంస్కృతిని ప్రతిబింబించే పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సరస్వతి పుష్కరాలు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే పవిత్ర పర్వదినాలు కాగా, ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు భక్తులకు చేరువ అవుతుండటంతో పాటు, రాష్ట్ర కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే వేదికగా మారుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను ఆస్వాదిస్తూ కళాకారులను అభినందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి చిర్రా రఘు అధికారులు పుష్కరాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టగా, భక్తులకు ఆధ్యాత్మికంతో పాటు సాంస్కృతిక ఆనందాన్ని అందించేలా ఏర్పాట్లు చేశారు.

# ఎత్తైన ప్రాంతాలకు శాశ్వత సాగునీరు అందించడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**తరిగొప్పుల, మే 22 ప్రభాతవార్త :**

తరిగొప్పుల మండలం గండిరామారం పంప్‌హౌస్ వద్ద కొనసాగుతున్న దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్-1 పనులను శుక్రవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారులు, ఇంజినీర్లతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతంగా పూర్తిచేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగ సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకున్న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తైన ప్రాంతాలకు శాశ్వత



సాగునీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందన్నారు. జనగామ, హన్మకొండ జిల్లాల్లోని తరిగొప్పుల, చిలుపూర్, ధర్మసాగర్, వేలేరు, మండలాలకు సాగునీటి పరిష్కారం కల్పించేందుకు రూ.110 కోట్లతో మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మంజూరు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. గండిరామారం పంపుహౌస్‌కు పోయేక్రమంలో గ్రామాల్లో వేసిన పైప్‌లైన్‌ను పరిశీలించడం, ఈ స్కీమ్‌లో నీళ్లచేరని కుంటలకు కూడ పరిశీలించాలని అధికారులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండలనాయకులు పింగిలి జగన్మోహన్‌రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ పద్మ నర్సింగరావు, బిఆర్‌ఎస్ నాయకులు పెద్దిరాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పద్మజ వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ జూలాలాల్, మాజీ అధికార ప్రతినిధి లింగం, తరిగొప్పుల మాజీ సర్పంచ్ ప్రభుదాస్, అబ్దుల్‌నాగారం మాజీసర్పంచ్ రమ సంపత్‌రెడ్డి, సోలిపురం సర్పంచ్ శ్రీను, నర్మెట సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు కంతిఅంజనేయులు, బొత్తల పర్రె సర్పంచ్ రవినాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరికొయ్యలు కాల్చివేతపై రైతుల ఆగ్రహం

**- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**బచ్చన్నపేట, మే 22 ప్రభాతవార్త :**

బచ్చన్నపేట మండలంలోని కట్కూర్, విఎస్‌ఆర్‌నగర్ గ్రామాల్లో శివారులో వరికొయ్యాలకు కొందరు వ్యక్తులు నిప్పుపెట్టడంతో రైతులకు భారీనష్టం వాటిల్లిందని కట్కూర్, విఎస్‌ఆర్‌నగర్ రైతులు ఆరోపించారు. పొలాల్లో నిల్వఉంచిన వరికొయ్యాలు పూర్తిగా కాలిపోవడంతోపాటు పశుగ్రాసం, మోటర్లవైర్లు, పైపులైన్లు కూడా మంటల్లో దగ్ధమయ్యాయి. ఈ ఘటనతో రైతులు తీవ్రఆందోళనకు గురయ్యారు. రైతులు తెలిపిన వివరాలప్రకారం.. ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయని, గాలివేగం కారణంగా మంటలు అదుపుతప్పి



పక్కనేఉన్న పశుగ్రాసపుకుప్పలు, వ్యవసాయానికి ఉపయోగించే మోటార్‌వైర్లు, ప్లాస్టిక్ పైపులైన్లు కాలిపోయాయన్నారు. స్థానికులు, రైతులతోకలిసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీనష్టం జరిగినట్లు వారుతెలిపారు. ఈ ఘటనలో పలువురు రైతులకు లక్షలరూపాయల మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. పశువులకు వేసవి కాలంలో అత్యవసరమైన పశుగ్రాసం పూర్తిగా కాలిపోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులకోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌వైర్లు, నీటి పైప్‌లైన్లు కూడా దెబ్బతినడంతో సాగుపనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వరికొయ్యాలకు



ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా లేదా అనేది విచారణ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులుమాత్రం ఇది కొందరి నిర్లక్ష్యం లేదా కావాలనే చేసిన చర్యకావచ్చని ఆరోపిస్తున్నారు.

# కష్టపడ్డ ప్రతీ ఒక్కరికి ఖచ్చితంగా గుర్తింపు

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి**

**కొడకండ్ల, మే 22 ప్రభాతవార్త :**

కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. శుక్రవారం కొడకండ్ల మండలానికి బీఆర్‌ఎస్ పార్టీ నూతన కమిటీని ప్రకటించారు. మండలకేంద్రంలో శుక్రవారం పార్టీకార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలకు అండగా



నిలవడానికి, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడడానికి గులాబీ జెండాను మళ్లీ రెపరెపలాడించడానికి ఈ నూతన సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్టీకోసం పనిచేసేవారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. నూతనకమిటీలో సింధే రామోజీ, పేరం రాము, ధారావత్ గాంధీనాయక్, దీకొండ వెంకటేశ్వర్లు, దుబ్బాక భాస్కర్‌రెడ్డి, జక్కుల విజయమ్మ, దేశాని సతీష్ సభ్యులుగా ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి, గ్రామస్థాయి బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పంటవ్యర్థాలు కాల్చకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలి

**రఘునాథపల్లి, మే 22 ప్రభాతవార్త :**

రఘునాథపల్లి మండలంలోని రైతులు, ప్రజలందరూ పంటవ్యర్థాలను కాల్చకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ డి.నరేష్ సూచించారు. ప్రస్తుతం ఎండలుతీవ్రంగా ఉన్న నేపథ్యంలో పంట వ్యర్థాలకు నిప్పంటిస్తే మంటలు వేగంగావ్యాపించి ఆస్తినష్టం, ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. పొలాల్లో పంటఅవశేషాలను కాల్చే సమయంలో



మంటలు అదుపుతప్పి వ్యవసాయ భూములు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, నివాసప్రాంతాలకు వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు. రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పంటవ్యర్థాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని కోరారు. పంట వ్యర్థాలనుకాల్చి ప్రమాదాలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్ఐ డి.నరేష్ హెచ్చరించారు. మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండి అగ్నిప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గబ్బెటలో భారీ అగ్నిప్రమాదం

**- గడ్డికట్టలు దగ్ధం.. రైతుల్లో ఆందోళన**

**రఘునాథపల్లి, మే 22 ప్రభాతవార్త :**

రఘునాథపల్లి మండలంలోని గబ్బెటగ్రామంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని కాటమయ్య గుడివద్ద ప్రారంభమైన మంటలు గఫార్‌పాలెం, కోతి సోమయ్య, రంగు నరసయ్య పొలాలవరకు వేగంగా వ్యాపించాయి. ఈ ఘటనలో పొలాల్లో నిల్వఉంచిన గడ్డికట్టలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో



స్థానికరైతులు, గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. మంటలు మరింత విస్తరించే అవకాశం ఉండటంతో రైతులు తమ పంటలు, గడ్డి నిల్వలను రక్షించుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. అగ్ని ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదానికి గలకారణాలు ఇంకా తెలియరాలేదు.

# ఇరిగేషన్ గేట్వాల్ ఏర్పాటుకు స్థల బహూకరణ



**తరిగొప్పుల, మే 22 ప్రభాతవార్త :**

మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ద్వారా గోదావరి నదీజలాలను తరలించేందుకుగాను ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్‌కు తరిగొప్పుల, నర్సాపూర్ గ్రామాల శివారులో గేట్వాల్ నిర్మించేందుకు తరిగొప్పుల మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి రెండుగుంటల స్వంతస్థలాన్ని ఎమ్మెల్యే సమక్షంలో రైతులకు బహూకరించారు. ఈ సందర్భంగా మ్మెల్యే పల్లారాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ గేట్వాల్ ద్వారా నర్సాపూర్ గ్రామంలోని తెట్టెకుంట, తరిగొప్పులకు చెందిన పెద్ద చెరువు, జల్లలకుంట, సొంటెక్కకుంట, కోడిచెరువు, పోతారంలోని చింతలచెరువు, గార్లకుంటకు సాగు నీరు అందుతోందన్నారు. మండలంలోని రైతుల కోసం తన పట్టా భూమిలో గేట్వాల్ ఏర్పాటు చేసుకునేందుకు రెండుగుంటల స్థలాన్ని బహూకరించిన శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించి, రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**తరిగొప్పుల, మే 22 ప్రభాతవార్త :**

తరిగొప్పుల మండలంలోని సోమ్లాతండా గ్రామ వాచ్యతండాలో విద్యుదాఘాతంతో ఎద్దుమృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గుగు లోతు తార్యకు చెందినఎద్దు శుక్రవారం వ్యవసాయ భూమివద్ద మేతమేస్తూ ఎవరులేని సమయంలో బోర్ సర్వీసు వైరుకుఉన్న సపోర్టువైర్‌కు విద్యుత్తు ప్రవహించడంతో ప్రమాదవశాత్తు దానికి ఎద్దుతగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.70వేల విలువైన కాడెద్దు మృతి చెందడంతో రైతు విలపించాడు. ఎద్దులతోనే వ్యవసాయం సాగుచేస్తూ జీవనంసాగిస్తున్నానని, ప్రభుత్వం తనకుపరిహారం అందజేయాలని బాధితరైతు కోరారు.

# అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించండి

**నర్మెట, మే 22 ప్రభాతవార్త :**



పెంకుటిండ్ల కలిగిన, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో నిలువఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే ఏర్పాటు చేయాలని కోరుతూ నర్మెట సర్పంచ్ గోపగోని శ్రీధర్‌గౌడ్ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ను కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గ్రామాలలో నెలకొన్న పలుసమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్‌ను కోరగా ఆ సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తెలిపారు.

# వినియోగదారులకు మరింత చేరువలో టీజీఎన్‌పీడీసీఎల్ యాప్

## 28 ఫీచర్లతో విద్యుత్ సేవలు మొబైల్‌లోనే.

## ఎస్ఈ బి.బిక్షపతి




**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త: మే 22:** వినియోగదారులకు మరింత చేరువై, సాంకేతిక పరంగా ఆధునిక సేవలను అందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి తెలిపారు. ప్రజల సౌకర్యార్థం 28 కీలక ఫీచర్లతో ఈ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. విద్యుత్ సంబంధిత సేవలను ఇంటి వద్ద నుంచే సులభంగా పొందేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా యాప్‌లో నమోదు చేసుకునే విధంగా "న్యూ కంప్లైంట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. మీటర్ నంబర్, సమస్య వివరాలు నమోదు చేస్తే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఫిర్యాదు పరిష్కార స్థితిని "కంప్లైంట్ స్టేటస్ ద్వారా తెలుసుకునే అవకాశం కూడా ఉందన్నారు. విద్యుత్ బిల్లులను సురక్షితంగా, వేగంగా చెల్లించేందుకు "పే బిల్స్ ఫీచర్ అందుబాటులో ఉందని తెలిపారు. సర్వీస్ నంబర్ నమోదు చేసి రెండు నిమిషాల్లోనే బిల్లు చెల్లించవచ్చని చెప్పారు. గతంలో చెల్లించిన బిల్లుల వివరాలు "బిల్ హిస్టరీలో లభిస్తాయని, విద్యుత్ వినియోగ వివరాలను విశ్లేషించుకోవచ్చని పేర్కొన్నారు. రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ ఫీచర్ ద్వారా విద్యుత్ ప్రమాదాలు లేదా సమస్యలను ఫోటో, జీపీఎస్ లొకేషన్‌తో నేరుగా అధికారులకు పంపవచ్చని తెలిపారు. కొత్త విద్యుత్ కనెక్షన్ విధానం, పేరు మార్పు, లోడ్ పెంపు లేదా తగ్గింపు, హెచ్‌టీ కన్స్యూమర్ పోర్టల్ వంటి సేవలు కూడా యాప్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. ఆన్‌లైన్ ఎస్టిమేట్ చార్జీలు, డిమాండ్ నోటీసు చెల్లింపులు, మీటర్ రీడింగ్‌పై అభ్యంతరాలు తెలిపే "చాలెంజింగ్ మీటర్స్, సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు వంటి సేవలు వినియోగ దారులకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆధార్, మొబైల్ నంబర్ లింక్ చేసుకుంటే ప్రతి నెల బిల్లు సమాచారం నేరుగా ఫోన్‌కు వస్తుందని తెలిపారు. డొమెస్టిక్ బిల్ క్యాలిక్యులేటర్ ద్వారా అంచనా బిల్లు తెలుసు కోవచ్చని, విద్యుత్ వినియోగ మార్గదర్శకాలు, సేఫ్టీ టిప్స్ కూడా యాప్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంస్థ సేవలపై వినియోగ దారులు ఫీడ్‌బ్యాక్ ఇవ్వవచ్చని, సమస్యల పరిష్కారం కోసం 24 గంటలు పనిచేసే 1912 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందన్నారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సేవలను వినియోగించుకోవాలని, నాణ్యమైన విద్యుత్ సేవల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి కోరారు.

# ఇటుక బట్టి కార్మికులకు అండగా నిలిచిన ఎస్పీ

## సోషల్ మీడియా ఫిర్యాదుతో కార్మికులకు న్యాయం.

## ఇటుక బట్టీ వద్దకు వెళ్లిన ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్.





**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త, మే 22 : సోషల్** మీడియా ద్వారా అందిన ఫిర్యాదుపై స్పందించిన ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ కార్మికులకు న్యాయం కల్పించారు. బందారుపల్లి గ్రామంలోని కేఎంకే బ్రిక్స్ ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న కార్మికులను అక్రమంగా నిర్బంధిస్తున్నారనే సమాచారంతో ఎస్పీ నేరుగా ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎస్పీ, యజమానితో కూడా చర్చించారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని, వారిని సొంత రాష్ట్రాలకు పంపేందుకు వాహన సౌకర్యం కూడా కల్పించినట్లు యజమాని వివరించినట్లు తెలిసింది. కార్మికులు తమ స్వగ్రామాలకు సురక్షితంగా వెళ్లేందుకు పూర్తి భరోసా కల్పించిన ఎస్పీ, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ఎస్ఐ ఉపేందర్ పాల్గొన్నారు.

# మన్యంలో చిరుత

## చిరుత సంచారంతో అప్రమత్తమైన అటవీ శాఖ

## ఎదిర గుట్టలు - యాకన్నగూడెం ప్రాంతాల్లో

## పాదముద్రల గుర్తింపు.

**వెంకటాపురం ప్రభాత వార్త, మే23:** వెంకటాపురం - చర్ల మండలాల పరిధిలోని ఎదిర గుట్టలు, యాకన్నగూడెం, సుబ్బంపేట ప్రాంతాల సరిహద్దుల్లో చిరుత సంచారం ఉన్నట్లు సమాచారం అందడంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించిన అటవీ శాఖ సిబ్బంది చిరుతకు సంబంధించిన అనుమానాస్పద పాదముద్రలను గుర్తించారు. చిరుత సమీప అటవీ ప్రాంతాల వైపు కదులుతున్నట్లు భావిస్తూ వెంకటాపురం - చర్ల అటవీ విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. గ్రామస్థులు అడవి అంచు ప్రాంతాల్లో పశువులు, గొర్రెల మేపుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు. మహిళలు, పిల్లలు సాయంత్రం, రాత్రి వేళల్లో ఒంటరిగా సంచరించవద్దని అటవీ శాఖ హెచ్చరించింది. చిరుత కనిపించిన పక్షంలో దానిని హాని చేయకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం1972 ప్రకారం వన్యప్రాణులకు హాని కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. సమాచారం కోసం ఎఫ్‌బీఓ లాలు (7569808435), ఎఫ్ఎస్ఓ జైసింగ్ (6281927840)లను సంప్రదించాలని సూచించారు.










# కార్పొరేట్ కాలేజీల్లో

# ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

## అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేయాలి.

## షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కొమురయ్య.



**ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త, మే 22:** 202627 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ ఇంటర్మీడియట్, ఎంసెట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కొమురయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 7.0 జీపీఏ అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, వికలాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మెరిట్ ఆధారంగా సి జీజీ ఆన్‌లైన్ ఆటోమేటిక్ సిస్టమ్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు https://www. telangana epass. cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల చివరి తేదీ జూన్ 5 కాగా, జూన్ 10న సెలక్షన్ ప్రక్రియ నిర్వహించి, జూన్ 12న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఎస్ఎస్సీ మార్కుల మెమో, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ తదితర పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

# ఎండ తీవ్రత నేపథ్యంలో

# ఉపాధి హామీ కూలీలకు సూచనలు

**ధర్మసాగర్, మే 22 (ప్రభాతవార్త):**



ధర్మసాగర్‌లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలను శుక్రవారం అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 6 గంటలకు పనులకు హాజరై ఉదయం 10 గంటల వరకు పనులు పూర్తి చేసుకుని వెళ్లాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పనులు నిర్వహించాలని కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో వార్డు సభ్యురాలు మలికిరెడ్డి మమత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏరియా ఉప సర్పంచ్ కొంతం కొమరమ్మ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

**భీమదేవరపల్లి: మే 22 (ప్రభాత వార్త)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామంలో ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాలు ప్రకారం వద్దేపల్లి లక్ష్మి (55) భర్త శాంతయ్య తన భర్త ఆరోగ్యం కుదుట ఉండడం లేదని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలు హైదరాబాదులోని మాదాపూర్ లో నివాసం ఉంటూ కొద్ది రోజుల క్రితమే ముత్తారం గ్రామానికి వచ్చి శుక్రవారం రోజున ఉదయం ఫ్యాన్ కు ఉరి వేసుకొని చనిపోయి ఉందని భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఖాకీ చొక్కాకు అంటిన ధాన్యపు పరిమళం

## రైతు బాంధవుడిగా పసర ఎస్. ఐ.

## మిల్లు గేటు తాకిన మానవత్వం

## బస్తాల గుట్టలో బంగారంలా మెరిసిన పోలీస్

## తెల్లవారుజాము నుంచే రైతులకు అండగా

## ఎస్ ఐ తాజుద్దీన్




**గోవిందరావుపేట ప్రభాతవార్త.** శాంతిభద్రతలే కాదు, రైతు కష్టం తెలిసిన ఖాకీ ఇది. గోవిందరావుపేట మండలం పసర ఎస్సై తాజుద్దీన్ చేస్తున్న సేవలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి. రైతుల సమస్యల పరిష్కారానికి ఆయన చూపుతున్న చొరవ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తెల్లవారుజాము 6:41కే మిల్లు వద్ద... మే 22న ఉదయం 6:41 గంటలకే ఎస్సై తాజుద్దీన్ పస్రా నాగరంలోని లక్ష్మీ గణపతి ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లు వద్ద ప్రత్యక్షమయ్యారు. ధాన్యం బస్తాలు లారీల్లోకి లోడ్ అవుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం అమ్మకాలు, తూకం, రవాణాలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్య ఎక్కడ ఉంటే పరిష్కారం అక్కడే రైతుల ఫిర్యాదులపై వెంటనే స్పందించిన ఎస్సై, మిల్లు యాజమాన్యంతో చర్చలు జరిపారు. "రైతుకు ఒక్క గింజ నష్టం జరగొద్దు. దళారుల ప్రమేయం ఉండొద్దు. తూకంలో తేడా రాకూడదు. లారీలు సకాలంలో అందుబాటులో ఉంచాలి" అని యాజమాన్యానికి స్పష్టం చేశారు. ఎస్సై జోక్యంతో అక్కడికక్కడే సమస్యకు పరిష్కారం లభించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మొట్లగూడెంలో ఆకస్మిక పర్యటన శుక్రవారం మొట్లగూడెం గ్రామంలో ఎస్సై తాజుద్దీన్ ఆకస్మికంగా పర్యటించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. "పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుంది. ఎవరూ ఆందోళన చెందవద్దు. మీకు అండగా నేనున్నా" అని రైతులకు భరోసా ఇచ్చారు. రైతన్నల మనసు గెలిచిన ఖాకీ ఉదయాన్నే మిల్లుల వద్దకు వచ్చి సమస్యలు తీర్చడం, గ్రామాల్లో తిరిగి రైతులకు ధైర్యం చెప్పడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ఖాకీ బట్టలు వేసుకున్నా రైతు బిడ్డలా మా కష్టం తెలిసిన అధికారి దొరికారు. ఎస్సై తాజుద్దీన్ సేవలు మరువలేనివి" అని స్థానిక రైతులు కొనియాడుతున్నారు. పోలీస్ శాఖ కేవలం శాంతిభద్రతలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవడం పట్ల మండల ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. ఖాకీకి మానవత్వం తోడైతే అది రైతన్నకు కొండంత అండగా నిలుస్తుందని ఈ ఘటన నిరూపించింది.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ఎన్.ఎఫ్. బి.ఎస్) పై అవగాహన

## గోవిందరావుపేట మండల ఎంపీడీవో సిహెచ్ వరుణ్ కుమార్




**గోవిందరావుపేట ప్రభాతవార్త** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ఎన్.ఎఫ్. బి.ఎస్. అవగాహన కార్యక్రమం గురించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో సి.హెచ్. వరుణ్ కుమార్ మండల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ఎన్ ఎఫ్ బి ఎస్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. పథకం ఉద్దేశం, కుటుంబ పోషకుడు మరణించిన సందర్భంలో ఆ కుటుంబానికి ఒకేసారి ఏక మొత్తంగా రూ. 20,000/ ఆర్థిక సహాయం అందించబడుతుంది. పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవడంలో సామాజిక భద్రత కల్పించి, వారి జీవనోపాధిని నిలబెట్టడం. ఈ పథకం జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం ఎన్.ఎస్.ఏ. పి. లో ఒక ఒక భాగమని అన్నారు. ఎవరు అర్హులు ,మరణించిన వ్యక్తి కుటుంబం దారిద్ర్య రేఖకు బి.పి.ఎల్. దిగువన ఉండి, వైట్ రేషన్ కార్డు/ఆహార భద్రతా కార్డుకలిగి ఉండాలిని, కుటుంబంలో ప్రధానంగా సంపాదించే పురుషుడు/స్త్రీ మరణించి, వారి భాగస్వామి మరియు/లేదా మైనర్ పిల్లలు మాత్రమే మిగిలి ఉండాలి. మరణించిన కుటుంబ పోషకుని వయస్సు 18-59 సంవత్సరాల, మధ్య ఉండాలి. సహజ మరణం గానీ లేదా ప్రమాదవశాత్తు గానీ సంభవించి ఉండవచ్చు. ఎవరు అనర్హులు ,ఆమ్ ఆద్మీ భీమా యోజన ఏ.ఏ. బి.వై. జనశ్రీ భీమా యోజన జె. బి. వై. ఆపద్బంధు పథకాల కింద సహాయం పొందిన వ్యక్తులు అనర్హులు అవుతారని అన్నారు. దరఖాస్తు విధానం మీ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, ఎన్ ఎఫ్ బి ఎస్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఎంపీడీవో లాగిన్‌లో ప్రతిబింబించిన వెంటనే, పంచాయతీ కార్యదర్శులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి డి.ఆర్. డి.ఓ. కార్యాలయానికి ఫార్వర్డ్ చేయబడుతుందని, జిల్లా కలెక్టర్ ఆమోదం తర్వాత, సీఈఓ, సి ఈ ఆర్ పి ద్వారా డిస్టిక్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ విధానంలో లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు నేరుగా నిధులు జమ అవుతాయని తెలిపారు. అలాగేఅవసరమైన పత్రాలు ఫోటోతో జత చేసిన దరఖాస్తు పత్రం ,తెలుపు రేషన్ కార్డు / ఆహార భద్రతా కార్డు, కుటుంబ పోషకుని మరణ ధృవీకరణ పత్రం, మృతుని ఆధార్ కార్డు, మృతుని వయస్సు నిర్ధారణ పత్రం, దరఖాస్తుదారుని ఆధార్ కార్డు, దరఖాస్తుదారుని పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఆదాయ ధృవీకరణ పత్రం ,కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, దరఖాస్తుదారుని బ్యాంకు పాస్ బుక్ మొదటి పేజీ నకలు, లబ్ధిదారుడు స్థానిక విచారణ అనంతరం కుటుంబ సభ్యులకు ఈ కుటుంబ ప్రయోజన సహాయం అందించబడుతుంది. ఈ పథకానికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయాన్ని, లేదా మీ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని ఎంపీడీవో సి.హెచ్. వరుణ్ కుమార్ మండల ప్రజలను కోరారు.

# మీడియా పాయింట్ ప్రతినిధులను సన్మానించిన సీఐ

హసన్ పర్తి, మే 22, ప్రభాతవార్త.




హసన్ పర్తి మండలంలో పనిచేస్తున్న పత్రిక మిత్రులు ఏర్పాటు చేసుకున్న మీడియా పాయింట్ కమిటీ ప్రతినిధులను శుక్రవారం స్థానిక సీఐ మహేందర్, కాకతీయ యూనివర్సిటీ సిఐ రవికుమార్ లు వారి వారి స్టేషన్లలో సన్మానించారు. మీడియా పాయింట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందించి, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సి ఐ లు మాట్లాడుతూ దిగజారుతున్న పత్రిక విలువల్ని కాపాడుకోవాలని, కలం ఎప్పుడు న్యాయం వైపు పనిచేయాలని, ప్రజలకు ,ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసి ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా మీడియా పాయింట్ మిత్రులు మంచి పేరును సంపాదించుకోవాలని వారు సూచించారు. అనంతరం మీడియా పాయింట్ ప్రతినిధులు హసన్ పర్తి తహసిల్దార్ కిరణ్ కుమార్ ను కలిసి మిఠాయి అందించారు. అధికారులను కలిసిన వారిలో మీడియా పాయింట్ అధ్యక్షులు ఎలక రాజు సదానందం, ప్రధాన కార్యదర్శి గరిగే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజకుమార్, సహాయ కార్యదర్శి గొల్లె రవీందర్, కమిటీ సభ్యులు జక్కుల విజయ్, రామంచ దయాకర్, ఎండి వాజిద్ లు ఉన్నారు.

# ఏటూర్‌నాగారం వార్త

# ఆదర్శ గ్రామం అంటే రోడ్లు కాదు, ఐక్యత

## ముత్తాపూర్‌లో బాలవికాస ఆధ్వర్యంలో గ్రామసభ



**గోవిందరావుపేట ప్రభాతవార్త.** మండలంలోని ముత్తాపూర్ గ్రామంలో శుక్రవారం బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణంపై గ్రామసభ నిర్వహించినట్లు సర్పంచ్ కుంజా స్వరూప తెలిపారు. గ్రామానికి చెందిన 220 మంది ప్రజలు, నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. అభివృద్ధికి, ఆదర్శానికి తేడా తెలుసుకోవాలి: కార్యక్రమంలో పాల్గొన్న బాలవికాస ఆదర్శ గ్రామం పథకం మేనేజర్ మంజుల, సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ "ఆదర్శ గ్రామం అంటే రోడ్డు, భవనాలు నిర్మించుకోవడం కాదు. వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టుబాట్లు, నియమాలు పెట్టుకుని వాటిని పాటిస్తూ ఊరంతా ఒకే మాట, ఒకే బాటలో ఐక్యతతో ఉంటే ఆదర్శ గ్రామం సాధించుకోవచ్చు" అని వివరించారు. "డబ్బులుంటే అభివృద్ధి చేసుకోవచ్చు కానీ, ఆదర్శ గ్రామమంటే ప్రజలందరూ కలిసి ఒకరికొకరు ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకుంటూ ఐక్యమత్యంతో గ్రామంలో ఉన్న వనరులను గుర్తించి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం. దీనివల్ల గ్రామంలోని సమస్యలు పరిష్కరించుకోవచ్చు" అని వారు స్పష్టం చేశారు. ఎనిమిది కమిటీల ఏర్పాటు: ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవడానికి ముందుకొచ్చిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. సర్పంచ్ హర్షం: సర్పంచ్ కుంజా స్వరూప మాట్లాడుతూ "బాలవికాస సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామ పంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాం. బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో మా గ్రామాన్ని ఎన్నుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా గ్రామంలో ఒక పండగ వాతావరణం నెలకొంది" అన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పోగొట్టుకున్న బ్యాగు, నగదును, అందజేత

## ఫిర్యాదు దారుడికి అందజేసిన హనుమకొండ సి ఐ మచ్చ శివకుమార్

**మే 22, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :** శుక్రవారం మహబూబాబాద్ కు చెందిన రాసాల ఉపేందర్ హనంకొండ లోని లక్ష్మీ నరసింహ హాస్పిటల్ లో పని ఉండి హనుమకొండ బస్టాండ్ వద్దకు వచ్చి అక్కడి నుండి ఆటో ఎక్కి హాస్పిటల్ దగ్గర ఆటోలోనే తన బ్యాగ్ ని మర్చిపోయి దిగి పోయాడు. మళ్లీ గుర్తుకు వచ్చి బయటికి వచ్చి చూసేసరికి ఆటో అక్కడి నుండి వెళ్లిపోయినది, వెంటనే అతను హనుమకొండ పోలీస్ వారిని సంప్రదించగా ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ పోలీస్ స్టేషన్లోని క్రైమ్ టీం కి సీసీ టీవీ కెమెరాలో వెరిఫై చేయమని చెప్పగా, మహిపాల్, అశోక్, రావుఫ్ లు ఆటో ని సీసీ కెమెరాల ద్వారా వెరిఫై చేసి ఆటోను ట్రాక్ చెసి పట్టుకొని ఫిర్యాదుదారుడైన రాసాల ఉపేందర్ కు అతనికి ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు రూపాయలు 70 వేల నగదు అతనికి అప్పగించడం జరిగినది. తన డబ్బు, మరియు ఒరిజినల్ సర్టిఫికెట్ల తనకు అప్పగించినందుకు హనుమకొండ పోలీస్ వారికి ఉపేందర్ కృతజ్ఞతలు తెలిపినాడు.



# జిల్లా స్థాయి ప్రజాపాలన సమావేశం

**పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**యువతి,యువకులకు ఉద్యోగ,ఉపాధి కల్పన**

**మహిళలకు 202627 ఆర్థిక సంవత్సరంలో 28 కోట్ల 28 బ్యాంకు రుణాలు**

**వడ్డి లేని రుణాలు 40కోట్ల 67లక్షలు పంపిణీ**

**ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి,కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



వరంగల్ సిటి మే22 ప్రభాతవార్త

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా స్థాయి సమావేశాన్ని వరంగల్ హంటర్ రోడ్డు లోని శ్రీ కన్వెన్షన్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి,నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ శ్రీ, వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ సారంగపాణి, పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్(లోకల్ బాడీ)గణేష్ పాల్గొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందిస్తోందన్నారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతున్నాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకు చేరుతున్నాయని చెప్పారు.వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ,మండల, నియోజకవర్గ స్థాయిలలో 10 కీలక అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పథకాలను అన్ని శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు,ఎం సువిధా నాబార్డ్ లో శిక్షణ పూర్తి చేసిన మహిళ సభ్యులకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు.2026 27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్,మే నెలల్లో జిల్లాలో 427 స్వయం సహాయక సంఘాలకు రూ.28 కోట్లు 28 లక్షల బ్యాంక్ లింకేజ్ రుణాల చెక్కులు అందజేశారు.అలాగే వడ్డీ లేని రుణాల పథకం కింద డిసెంబర్ 2023 నుంచి నవంబర్ 2025 వరకు 9,669 స్వయం సహాయక సంఘాలకు రూ.40 కోట్లు 67 లక్షల చెక్కులను మహిళా సంఘాలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కు సంబంధించిన సావనీర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. డీఆర్ఓ విజయలక్ష్మి శ్రీ, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి,వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ ఆనందం,సంబంధిత జిల్లా అధికారులు,వ ంండల తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యపు కల్లాల్లో రైతన్నల కన్నీళ్లు

**గీసుగొండ తహసిల్దార్ కు వినతి పత్రం**

**బిజెపి గీసుగొండ మండల అధ్యక్షులు కొంగర రవి**



గీసుగొండ ప్రభాతవార్త.

తెలంగాణలో ఆరుగాలం చెమటోడ్చి, రక్తాన్ని కూడుగా మార్చి పంట పండించిన రైతన్న పరిస్థితి రోజురోజుకూ అత్యంత దయనీయంగా మారుతోందని బి జె పి గీసుగొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరక్ష్యం, ప్రణాళికా లోపం కారణంగా నేడు అన్నదాతలు, కన్నీళ్లు కార్చాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. రైతులు తాము పండించిన వరి ధాన్యం, మొక్కజొన్న పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల చుట్టూ వారాల తరబడి తిరుగుతూ నరకయాతన అనుభవిస్తున్నారని మరికొంతమంది మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోయారు అనడంలో సందేహము లేదు అని ధ్వజమెత్తారు. కేంద్రాలకు ధాన్యం వచ్చి నెల రోజులు గడుస్తున్నా కాంటాలు కావడం లేదని, ఐకేపీ కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉందని ఆరోపించారు. హమాలీలు, లారీలు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పడకేసిందని, దీనివల్ల కల్లాల్లో ధాన్యం రాశులు బారులు తీరి ఉన్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. ఆన్‌లైన్ బిల్లులు రావడానికి నెల రోజులకు పైగా సమయం పడుతుండటంతో రైతులు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నారని పేర్కొన్నారు. వీటన్నిటికీ తోడు ధాన్యం, తేమ పేరిట ఐకెపి కేంద్రాల నిర్వాహకులు క్వింటాల్‌కు 3 నుండి 5 కిలోల వరకు ధాన్యం కటింగ్ చేస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లు కూడా లారీల యజమానులతో చేతులు కలిపి దిగుమతిలో ఉద్దేశపూర్వక జాప్యం చేస్తూ, లారీకి 10 నుండి 20 బస్తాల వరకు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. అకాల వర్షాలు వస్తే వేలాది బస్తాల ధాన్యం తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలను యుద్ధప్రతిపాదికన అందుబాటులోకి తెచ్చి వెంటనే కాంటాలు పెట్టించాలి. ధాన్యం తరుగు, తేమ పేరిట రైతులను ఇబ్బంది పెట్టే నిర్వాహకులు, మిల్లర్లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల లోపల రైతుల ఖాతాల్లో డబ్బులు నేరుగా జమ చేయాలి. ఈ సమస్యలపై స్థానిక తహసిల్దార్ తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాలని, రైతాంగాన్ని కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటూ జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, గట్టికొప్పుల రాంబాబు,15, 16 డివిజన్ ల అధ్యక్షులు లాదెళ్ల ప్రభాకర్, ప్రసన్న రామ్ ప్రసాద్,జిల్లా కౌన్సిల్ నెంబర్ గోదాసి అశ్విన్,బిల్లా రమేష్ డివిజన్ జనరల్ సెక్రెటరీ రాధారపు మల్లికార్జున్, కందికొండ ప్రదీప్,మహిళా మోర్చా నాయకురాలు బందెల రేణుక, నాయకులు,కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డి గొప్ప సంఘసంస్కర్త వారి ఆశయాలను స్ఫూర్తి గా తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




వరంగల్ సిటి మే22 ప్రభాతవార్త

భాగ్యరెడ్డి వర్మ భారతదేశంలో ఒక సంఘసంస్కర్త అని అన్నారు.నేటి యువతి యువకులకు భాగ్యరెడ్డి ఆశయాలను స్పూర్తి గా తీసుకొని ముందుకు పోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి ఉత్సవాలను శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి,జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి,డిబిసిడిఓ భాగ్యలక్ష్మి శ్రీ,మండల పరశురాములు పాల్గొని భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘసంస్కర్త అని బాలబాలికల కోసం ప్రాథమిక పాఠశాల ను నెలకొల్పరన్నారు. అంతేకాకుండా దేవదాసి, జోగిని వ్యవస్థ నిర్మూలనకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు.అందుకే ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,బిర్రు మహేందర్ మన్నే బాపూరావు,కేదాసి మోహన్,ఎలందరు తదితరులు పాల్గొన్నారు.




# ప్రమాదంలో ఇరుక్కున్న రైతు దంపతులకు

**హుటాహుటిన హాస్పత్రికి తరలించిన హాసన్ పర్తి పోలీసులు**

వరంగల్ క్రైం/హాసన్ పర్తి ప్రభాతవార్త



హాసన్ పర్తి మండలం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న రైతు దంపతులు ప్రమాదంలో ఇరుక్కున్నారు. గుంటూరుపల్లి గ్రామ పంచాయతీలో రైతులతో నిర్వహించిన సమావేశాన్ని ముగించుకుని అటుగా వస్తున్న హసన్‌పర్తి సీఐ మహేందర్ ప్రమాదంలో ఇరుక్కున్న భార్య భర్తలను పోలీస్ వాహనంలో హుటాహుటిన హాస్పత్రికి తరలించారు. దగ్గరుండి హాస్పత్రికి తరలించి సకాలంలో వైద్య సేవలు అందించేలా కృషి చేశారు. ఏనుమాముల మార్కెట్‌కు వెళ్లి మిర్చి తీసుకుని ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై గుంటూరుపల్లికి తిరిగి వెళ్తున్న మడిపల్లి పద్మ, వెంకటస్వామి దంపతులకు ఊహించని ప్రమాదం ఎదురైంది. బండి వెళ్తున్న సమయంలో పద్మ కట్టుకున్న చీర అకస్మాత్తుగా వెనుక చక్రంలో ఇరుక్కుపోవడంతో అదుపుతప్పిన వాహనం నుంచి దంపతులిద్దరూ ఒక్కసారిగా రోడ్డుపై కిందపడిపోయి గాయపడ్డారు. అదే దారిలో వెళ్తున్న సీఐ మహేందర్ విలవిల్లాడుతున్న దంపతులను గమనించి క్షణం కూడా ఆలోచించకుండా తక్షణమే స్పందించారు. రోడ్డుపై ఉన్న క్షతగాత్రులను వెంటనే స్వయంగా తన పోలీసు వాహనంలోకి ఎక్కించుకుని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా హసన్‌పర్తి ఆసుపత్రికి తరలించి వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూశారు. సకాలంలో మానవత్వాన్ని, సామాజిక బాధ్యతను చూపించిన పోలీసుల ఈ ఘటన నగరంలో ప్రశంశలు అందుకుంది. ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతగా నిలిచిన పోలీసుల సమయస్ఫూర్తిని, సేవాతత్వం చూసి ప్రజలు ప్రశంశిస్తున్నారు.

# భూసారాన్ని పెంచుకోండి

# రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకోండి

**50 శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య**



వర్ధన్నపేట/మే 22 ప్రభాతవార్త

భూమి సారాన్ని పెంచుకోవడానికి రైతులు పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని, తద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి అధిక దిగుబడులు సాధించాలని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ నరుకుడు వెంకటయ్య పిలుపునిచ్చారు.శుక్రవారం వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రంలో వానకాలం 202627 సీజన్‌కు సంబంధించి సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తోందని వెల్లడించారు. 50 శాతం సబ్సిడీ పోను, 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగు రైతుకు రూ. 2138/లకు లభిస్తుంది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తోందని, మండలంలోని అన్ని అగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రెండున్నర ఎకరాల వరకు వరి సాగు చేసే రైతులకు ఒక బ్యాగు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే వారికి రెండు బ్యాగుల చొప్పున పంపిణీ చేస్తారు. విత్తనాలు పొందాలనుకునే రైతులు తమ పట్టాధార్ పాస్‌బుక్ , ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి కి సమర్పించి, వారి ధృవీకరణ పొందిన తర్వాతే విత్తనాలను తీసుకోవాలని సూచించారు. ఇల్లంద సర్పంచ్ బేతి సాంబయ్య, ఏఈఓ విజయ్ కుమార్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు, ఉప సర్పంచ్ బొచ్చు జ్యోతి యాదగిరి, మాజీ ఎంపీటీసీలు గోడిశాల శ్రీనివాస్, పిట్టల జ్యోతి రమేష్, పల్లె పెంటయ్య,నాంపెల్లి వెంకన్న,ఎండి లథీప్, వార్డు సభ్యులు తుళ్ల శైలజ అనిల్, ఎర్రబెల్లి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వేగవంతం కావాలి

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**



కేంద్రప్రభుత్వ పథకాలను, రాయితీలను పొందడానికి ఫార్మర్‌రిజిస్ట్రీ తప్పనిసరిఅని, ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఫార్మర్‌రిజిస్ట్రీ, క్రాప్‌బుకింగ్, రైతుభీమా మీద శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఏఈఓని ఇప్పటివరకు నమోదైన ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి, అర్హులైన ప్రతి రైతుతోనూ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయించాలన్నారు. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియకూడా వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ, రైతుబీమా, డిజిటల్ క్రాప్ట్‌సర్వే, రైతు నేస్తం, మట్టిపరీక్షల, ఫర్టిలైజర్‌యాప్ రైతుల ఫోన్‌నెంబర్ అప్డేషన్ ప్రత్యేక శ్రద్ధతీసుకొని పూర్తిచేయాలన్నారు. భూమిఉన్న ప్రతీరైతు తనకుఉన్న భూములకు సంబంధించిన వివరములతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని కలెక్టర్ [illegible] సూచించారు. మరణించిన రైతు కుటుంబానికి రైతుభీమా పథకంద్వారా రూ. 5లక్షల ఆర్థికసాయాన్ని సకాలంలో అందించేలా ఏఈఓలు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికాసోని, డివిజన్ ఏడీలు, ఎంఏఓలు, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.



# జనగామ వార్త

## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**జనగామ టౌన్, మే 22 ప్రభాతవార్త :**



2026-27విద్యాసంవత్సరంలో కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకోసం అర్హులైన విద్యార్థులనుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశాలకోసం ఈనెల 20నుంచి జూన్05 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, పిహెచ్‌సి, మైనారిటీవర్గాలకు చెందిన విద్యార్థులు సంబంధిత ధృవపత్రాలతో ద్వారా ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశానికి మార్చి-2026లో పదవతరగతి ఉత్తీర్ణులై జీపీఏ7.0 లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అలాగే ఈ ప్రవేశాలకు కేవలం ప్రభుత్వపాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్‌పాఠశాలలు, నవోదయపాఠశాలలు, తెలంగాణ ఆదర్శపాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల్లో చదివిన విద్యార్థులుమాత్రమే అర్హులని స్పష్టంచేశారు. అర్హులైన విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీతగడువులోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. ముఖ్యమైన తేదీలుఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ఈనెల 20 నుండి జూన్5 వరకు, ఎంపిక జాబితా విడుదల జూన్10న, ధృవపత్రాల పరిశీలన, కళాశాల అలాట్‌మెంట్ ఆర్డర్ల జారీ జూన్12వ తేదీవరకు ఉంటుందని తెలిపారు.

# జనగామలో "రోడ్డు"న పడ్డ ట్రాఫిక్..!

**- ఆక్రమణల మయంగా ప్రధాన కూడళ్లు**

**- నరకయాతనలో వాహనదారులు పాదచారులు**

**- అధికారులు మేల్కొనకపోతే భారీప్రమాదాలు తప్పవు**

**జనగామ, మే 22 ప్రభాతవార్త :**



జనగామ జిల్లాకేంద్రంలో అక్రమ ఆక్రమణలు రోజురోజుకూ హద్దులు దాటుతున్నాయి. పట్టణంలో ప్రధానరహదారులు, వ్యాపార సముదాయాల ముందున్న ఖాళీస్థలాలు క్రమంగా మాయమవుతున్నాయి. ఫుడ్‌కోర్టులు, టిఫిన్‌సెంటర్లు, స్ట్రీట్ వెండర్ల ఇష్టారాజ్యమైన వ్యాపారాలతో రోడ్లన్నీ ఆక్రమణల మయంగా మారాయి. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తూ ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం కంటి నిండా నిద్రపోతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**- సిగ్నల్స్ వద్దే ప్రాణసంకటం..:**

ముఖ్యంగా జనగామ ప్రధానకూడలి సిగ్నల్స్‌వద్ద పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. సూర్యాపేటరోడ్డు నుంచి పట్టణంలోకివచ్చే మార్గంలో రహదారిని ఆనుకునే టిఫిన్ సెంటర్లు వెలిశాయి. వీటివద్దకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో వెనుకవచ్చే వాహనదారులకు ప్రాణాపాయంగా మారింది. ఇటు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సిగ్నల్స్ వరకు, అటు నుంచి సిద్దిపేటరోడ్డు వరకు పలుప్రాంతాల్లో రహదారులను ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం నిత్యకృత్యంగా మారింది.

**- కిరాయిల దందా..:**

దుకాణదారులు తమషాపుల ముందున్న పార్కింగ్ స్థలాలను సైతం వదలకుండా వస్తువులు, భారీ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు పెట్టి నింపేస్తున్నారు. అంతటితో ఆగకుండా, కొందరు యజమానులు ఆ పార్కింగ్ స్థలాలను చిరు వ్యాపారులకు రోజువారీ కిరాయిలకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- చలానాలే తప్ప.. చర్యల్లేవు..!**

ఈ ఆక్రమణల కారణంగా కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. దీంతో భారీగాట్రాఫిక్ జామ్‌లు ఏర్పడటమే కాకుండా, ప్రమాదాల ముప్పు పొంచిఉంది. పోలీస్‌శాఖ కేవలం నో పార్కింగ్ చలానాలువేసి చేతులు దులుపుకుంటోందే తప్ప, అసలుసమస్య అయిన ఆక్రమణలను తొలగించడంలో విఫలమవుతోందని స్థానికులు మండిపడుతున్నారు.

**- పాదచారుల పాట్లు..:**

రోడ్లపక్కన కనీసం నడవడానికి కూడా స్థలంలేకపోవడంతో పాదచారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఫైర్‌ఇంజన్ వంటి వాహనాలకు కూడా మార్గందొరకని దుస్థితి నెలకొంది.

**- ప్రజల డిమాండ్..:**

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని పట్టణప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే ఒక ప్రత్యేకడ్రైవ్ నిర్వహించి రోడ్లపైఉన్న అక్రమఫుడ్ కోర్టులు, టిఫిన్ సెంటర్లు, స్ట్రీట్ వెండర్లను పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తువీడి కఠినచర్యలు తీసుకోకపోతే, జనగామ పట్టణంలో ఎప్పుడైనా భారీప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

## కూతురిని అమ్మి బలవంతపు వివాహం

**- తండ్రి సవతి తల్లి, వరుడిని అరెస్టుచేసిన పోలీసులు**

**- యువతి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసునమోదు**

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**

కూతురిని రూ. 20లక్షలకు అమ్ముకొని, ఆమెకు ఇష్టంలేకపోయినా బలవంతంగా వివాహం జరిపించిన ఘటనలో తండ్రి, సవతి తల్లి, వివాహం చేసుకున్న వ్యక్తిని జనగామ పోలీసులు శుక్రవారం అరెస్ట్‌చేశారు. ఈ మేరకు జనగామ పోలీసులు కేసునమోదు చేసి ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలకేంద్రానికి చెందిన కక్కెర్ల లహరి (18) జనగామలోని గౌతమి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఆమె తండ్రి కక్కెర్ల రాకేష్‌గౌడ్, సవతి తల్లి రేణుకకలిసి లహరిని పెంబర్తి గ్రామానికి చెందిన ఆవుల ప్రశాంత్ రెడ్డికి రూ. 20లక్షలకు ఇచ్చి వివాహం జరిపించినట్లు ఆరోపణలుఉన్నాయన్నారు. యువతికి పెళ్లి ఇష్టం లేకపోయినా, "వివాహం చేసుకోకపోతే పురుగుల మందుతాగి చనిపోతాం" అంటూ తల్లి దండ్రులు బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో ఆమె ఇష్టానికి విరుద్ధంగా ఈ నెల 8న వివాహం జరిగినట్లు సమాచారం. అనంతరం ఈనెల 21న బాధిత యువతి జనగామ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో సీఐ పి. సత్యనారాయణరెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం తండ్రి రాకేష్ గౌడ్, సవతి తల్లి రేణుక, వరుడు ఆవుల ప్రశాంత్‌రెడ్డిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కుపంపించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ పి. సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ భరత్, చెన్నకేశవులు, పోలీసు సిబ్బంది కర్ణాకర్, కృష్ణ, అనిల్‌కు మా ర్, రమేష్, మధులను జనగామ ఇన్‌చార్జ్ ఏసీపీ భీమ్‌శర్మ అభినం దించారు.

## ఏజీపీ నియామకానికి న్యాయవాదుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**జనగామ టౌన్, మే 22 ప్రభాతవార్త :**

జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జికోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) నియామకానికి అర్హులైన న్యాయవాదుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతకలిగిన అభ్యర్థులు ప్రభుత్వంనిర్దేశించిన నిబంధనలప్రకారం అనుభవం, అర్హతపత్రాలు ఇతర వివరాలతో తమదరఖాస్తులను నిర్ణీతగడువు తేదీ ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరఫున న్యాయపరమైన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించగల న్యాయవాదులను ఎంపికచేయడం ఈ నియామక ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పూర్తివివరాలకు బార్‌కౌన్సిల్ లేదా జిల్లాకలెక్టరేట్ కార్యాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## డీసీపీ చిత్రంవేసి ఆకట్టుకున్న విద్యార్థి సృజన్

**జనగామ టౌన్, మే 22 ప్రభాతవార్త :**

జనగామ సోషల్‌వెల్ఫేర్ స్కూల్‌లో 9వతరగతి చదువుతున్న విద్యార్థి సృజన్ తన కళాప్రతిభతో జిల్లా డీసీపీని ఆకట్టుకున్నాడు. వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ చిత్రాన్ని పెన్సిల్‌తో గీసి స్వయంగా అందజేయగా, చిత్రాన్ని పరిశీలించిన డీసీపీ విద్యార్థి ప్రతిభను అభినందించారు. చదువుతోపాటు చిత్రలేఖనం వంటి సృజనాత్మకరంగాల్లో కూడా ముందుకు సాగాలని సృజన్‌కు డీసీపీ సూచించారు. భవిష్యత్తులో విద్యాపరంగా గానీ, చిత్రలేఖనం విషయంలోగానీ అవసరమైన సహాయం అందిస్తానని హామీఇచ్చారు. అలాగే, సృజన్‌లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన అతని గురువు కాసాల సంతోష్ కుమార్‌ను కూడా డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు. సృజన్‌తండ్రి నర్సింగరావు మేస్త్రీగా పనిచేస్తుండగా, తల్లి స్వప్నప్రియ స్థానిక టీవీఎస్ షోరూమ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సృజన్ తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకున్నారు.





# పొలంలో నిప్పు వద్దు నిండు ప్రాణం ముద్దు

### కొయ్యకాలకు నిప్పు పెడితే కేసులు తప్పవు

**కమలాపూర్:ప్రభాత వార్త.**

ప్రస్తుతం మండుటెండలు, వడగాల్పులు తీవ్రంగా ఉన్న ఈ సమయంలో రైతులు నిర్లక్ష్యంగా, అనాలోచితంగా పొలాల్లోని కొయ్యకాళ్లకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతోందని, భూమిపై ఉండే లక్షలాది సూక్ష్మజీవులు, మూగజీవాలు సజీవ దహనం అవుతున్నాయని కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కమలాపూర్ పోలీసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉష్ణోగ్రతలు మరింత పెరిగి మానవాళికి పెనుముప్పుగా మారుతోందని హెచ్చరించారు. గురువారం ఆరెపల్లి, గుంటూరుపల్లి, శంబునిపల్లి, బావుపేట గ్రామాల శివార్లలో కొయ్యకాళ్లకు పెట్టిన మంటలు వందల ఎకరాలకు వ్యాపించి ఊర్లే కాలిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇందులో ఒక ట్రక్కు పూర్తిగా బూడిదైపోయింది. చిన్నపిల్లలు సైతం లోటలు, ముంతలతో నీళ్లు పోస్తూ మంటలార్పడానికి అవస్థలు పడ్డారు. స్వయంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి కమలాపురం పోలీసులు, రాత్రి 10:30 గంటలకు సిబ్బందితో కలిసి ఆరెపల్లిబావుపేట శివార్లలోని పొలాల్లోకి వెళ్లి, రైతుల సహాయంతో పచ్చని చెట్ల మండలను అడ్డుపెట్టుకొని మంటల వేడికి, పొగకు ఉక్కిరిబిక్కిరవుతూ రాత్రంతా మంటలను ఆర్పడానికి తిప్పలు పడ్డారు. చీకట్లో ఎక్కడ బావులున్నాయో, ఎక్కడ గుంతలున్నాయో తెలియని స్థితిలో న,ఏసిపి వెంట ఉన్న సిబ్బంది ప్రాణాలకు తెగించి శ్రమించారు. గురువారం రాత్రి ఎసిపి, పోలీస్ సిబ్బందికి అదే జరిగింది.అందుకే రైతన్నలారా, అక్కలారా, మీ ఇష్ట దైవం మీద ఒట్టేసి ఇకనుండి మంటలు పెట్టను, పెట్టనివ్వనని మాటివ్వండి. ఈ భూమి మీద జీవించే హక్కు అందరికీ ఉంది. స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం



దక్కేలా ప్రతి ఒక్కరం తిప్పలు పడాలి అని ఎసిపి ప్రశాంత్ రెడ్డి కోరుతున్నారు.హార్వెస్టర్ల డ్రైవర్లకు చెప్పి పంటను కిందివరకు కోయించండి. ఎంత తిప్పలైనా పడుదాం కానీ నిప్పు పెట్టే అలవాటును మానుదాం. ఇక చాలు, మంటలు పెట్టే సంస్కృతికి చరమగీతం పాడుదాం అని అన్నారు. కొయ్యకాళ్లను తగలబెట్టడం వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రజలు దీనిని గుర్తించి తక్షణ నివారణ చేపట్టాలి. లేనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.ఎవరైనా కొయ్యకాళ్లను తగలబెడితే వెంటనే..కమలాపూర్ ఎస్‌హెచ్‌ఓ 8712685125.. కమలాపూర్ ఎస్సై 8712685249 ..కమలాపూర్ పీఎస్ 8712685014..నెంబర్లకి సమాచారం ఇవ్వగలరని తెలిపారు.రైతన్నలు ఏసిపి ప్రశాంత్ రెడ్డి, పోలీసుల,ఈ మనోవేదనను అర్థం చేసుకొని సహకరిస్తారని ఆశిస్తున్నారు.మంటలు కాదు, మమతలు పంచుదాం. భూతల స్వర్గాన్ని కాపాడుకుందాం. అని తెలిపారు




## పద్మశాలి రాష్ట్ర కమిటీలో కమలాపూర్‌కు పెద్దపీట ముగ్గురికి కీలక పదవులు



**కమలాపూర్: ప్రభాత వార్త.**

తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గంలో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి ప్రాధాన్యం దక్కింది. కమలాపూర్‌కు చెందిన ముగ్గురు నేతలకు రాష్ట్ర స్థాయి పదవులు వరించాయి.హనుమకొండలోని వి గ్రాండ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ నియామకాలు జరిగాయి. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్ చేతుల మీదుగా నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.పద్మశాలి కుల అభివృద్ధి, సంఘ బలోపేతం కోసం చేస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ కమలాపూర్‌కు చెందిన తవ్వుట రవీందర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా, సీనియర్ పాత్రికేయులు పులికంటి రాజేందర్‌ను రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా, బొప్ప శివ శంకర్‌ను రాష్ట్ర ఈసీ మెంబర్‌గా నియమించారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేతలు మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి పద్మశాలి సంఘాలను బలోపేతం చేయడంతో పాటు చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేష్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొప్పెరి వెంకట హరికిషన్, మేకల జనార్ధన్‌తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా సంఘ నాయకులు పాల్గొన్నారు

## వీరభద్ర పురుషుల పొదుపు సమితి వార్షిక మహాసభ




**భీమదేవరపల్లి: మే 22 (ప్రభాతవార్త)**

వీరభద్ర పొదుపు సమితి వార్షికమహాసభ సమితి అధ్యక్షులు గాజుల సతీష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ మహాసభలో సహా వికాస వ్యవస్థాపకులు మామిడి రామారెడ్డి కి నివాళులర్పించి పూలమాలలు వేశారు. సమితి లావాదేవీలను సమితి పరిధిలో ఉన్న అన్ని సంఘాల పాలకవర్గ సభ్యులకు వివరించారు.ఉమ్మడి సమితి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా 15వ సారి ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక పట్ల ఏడు సంఘాల అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమితి ఉపాధ్యక్షులుగా బొల్లోని పల్లి పిట్టల ఐలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం సమావేశంలో నూతన సమితి అధ్యక్షులు గాజుల సతీష్ మాట్లాడుతూ కొత్తకొండ లో నూతనంగా ఏర్పడిన సమితిని అన్ని సమితులతో పోల్చితే మన సమితిని ముందు వరసలో ఉండే విధంగా నా వంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహావికస డీఏవో నవీన్, కోశాధికారి రేవతి, అన్ని గ్రామాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, ఘనకులు తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలపై తహశీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి

**ఆత్మకూరు, ప్రభాతవార్త మే 22:**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ, తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ వాటిని వెంటనే అరికట్టి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వారాల తరబడి నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళిక లోపం వల్ల రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కాంటాలు, గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలను అందుబాటులోకి తీసుకురావాలని, తేమ, తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రాలకు వచ్చిన ప్రతి ధాన్యపు గింజను వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గట్టు వేణు గౌడ్, ఎదులాపురం శ్రవణ్ కుమార్, ఇర్సడ్ల సదానందం, రవ్వ శివప్రసాద్, బలభద్ర దినేష్, జక్కుల మహేందర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యుత్ ఘాతంతో 7 ఎకరాల వరి గడ్డి, 200 బస్తాల వడ్లు దగ్ధం

### రైతుకు సుమారు రెండు లక్షల నష్టం రైతు ఆవేద



**భీమదేవరపల్లి: మే22(ప్రభాతవార్త)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో గురువారం ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో ఏడు ఎకరాలకు సంబంధించిన వరి గడ్డితో పాటు, సుమారు 200 బస్తాల మేల్ సీడ్ వడ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. కొండబత్తిని నారాయణ అనే కౌలు రైతు, మరొకరికి చెందిన ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల మేల్, ఫిమేల్ సీడ్ వరి పంటను కోశారు. ఫిమేల్ సీడ్ వడ్లను ఇప్పటికే విక్రయించగా,మేల్ సీడ్ వడ్లను అదే పొలంలో ఒక పక్కన కుప్పలుగా పోసి ఉంచారుట్రాన్స్ఫార్మర్ నిప్పురవ్వల వల్ల నా కష్టం అంతా బూడిదైందన్నారు. సుమారు రెండు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని,అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను,ఇప్పుడు పూర్తిగా రోడ్డున పడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నన్ను ఆదుకోవాలని .ఖిఖి బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ ఈ ఘోర ప్రమాద సంఘటనను ఉన్నతాధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధిత రైతుకు ప్రభుత్వం నుండి తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు

## సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ తనిఖీ

**ధర్మసాగర్, మే 22 (ప్రభాతవార్త):**

ధర్మసాగర్ మండల పరిధిలోని దేవునూరు, సోమదేవరపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సెన్సస్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను శనివారం అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తనిఖీ చేశారు.తనిఖీల్లో భాగంగా ఎన్యుమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి, డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా 100 శాతం ఖచ్చితత్వంతో సమాచారాన్ని నమోదు చేయాలని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సూచనలు, మార్గదర్శకాలు అందించారు.జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ సర్వేను ఎలాంటి అక్షర దోషాలు,సాంకేతిక లోపాలు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్ జి. సదానందం తహసీల్దార్,కె. అనిల్ కుమార్ అదనపు ఛార్జ్ ఆఫీసర్ఎంపీడీవో, రవిసెన్సస్ సూపర్‌వైజర్ సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు,ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు

## వరంగల్ I డిపోలో డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం

**మే 22, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :**

నేడు శనివారం 23052026 న టిజిఎస్ ఆర్టిసి వరంగల్ 1 డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పుప్పాల అర్పిత ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు 9959226047 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని కోరారు. ముఖ్యంగా హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల తదితర రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సలహాలు, సూచనలు తెలియజేసి డిపో అభివృద్ధికి తోడ్పవలసిందిగా డిపో మేనేజర్ పుప్పాల అర్పిత గారు ఒక ప్రకటనలో కోరారు.

# వేతనాల పెంపు కాంట్రాక్ట్ కార్మికులకు వరం

**జనక్‌ప్రసాద్ చొరవతో వేతనాల పెంపు**

**1.11 కోట్ల మందికి ఆర్థిక ప్రయోజనం**

**ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధుకర్‌రెడ్డి**

భూపాలపల్లి, మే22, ప్రభాతవార్త

తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకోవటం చారిత్రాత్మకమని ఐఎన్‌టియుసి భూపాలపల్లి బ్రాంచీ వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని ఐఎన్‌టియుసి బ్రాంచీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్ల నుండి రాష్ట్రంలో కనీస వేతనాల సవరణ జరగక పోవటంతో కోట్లాది మంది వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కార్మిక పక్షపాతి, ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌ను తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమించటం జరిగిందని, పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్రంలో



పలు రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేసి వేతనాలతో పాటు వారికి సంక్షేమం కోసం పలు సూచనలు చేయటం జరిగిందన్నారు. జనక్‌ప్రసాద్ సలహాలు, సూచనల మేరకు తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు 1.11 కోట్ల మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకోగా జూన్ నుండి అమలు చేయాలని భావిస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలను పెంచటంలో భాగంగా మూడు జోన్లు చేసి నాలుగు కేటగిరిలుగా విభజించటం జరిగిందన్నారు. అన్‌స్కిల్డ్ వేతనాలు రూ.12,750 నుండి 16,000, సెమీ స్కిల్డ్ రూ. 13,152 నుండి 17,000, స్కిల్డ్ కార్మికులకు 13,772 నుండి 18,500, హైలీ స్కిల్డ్ కార్మికులకు 14,607 నుండి 20 వేలకు పెంచటం జరిగిందన్నారు. ఈ వేతనాల పెంపుతో కోట్లాది మంది కాంట్రాక్ట్ కార్మికులకు లబ్ధి చేకూరనుందని అన్నారు. వేతనాల పెంపుకఉ సలహాలు ఇచ్చిన జనక్‌ప్రసాద్‌కు, అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఉప సంఘం సభ్యులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జోగ బుచ్చయ్య, సెక్రటరీ పసునూటి రాజేందర్, ఏరియా స్ట్రక్చర్ కమిటీ మెంబర్ షేక్ హుస్సేన్, నాయకులు రాజేష్ ఠాకూర్, కుదుదుల శంకర్, రవికిరణ్, నవీన్‌కుమార్, కుదుదుల రాయమల్లు, కర్రు సంతోష్, సోతుకు సమ్మయ్య, గట్టు రాజు, చిరుత లక్ష్మీనారాయణ, కూతురు కుమారస్వామి, చిన్న మల్లయ్య, నరసింగరావు, భరత్‌శ్రీను, బండబాబు, అప్పం రాములు, కంకణాల శ్రీనివాసరెడ్డి, తిరుపతి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమిష్టి కృషి అవసరం

**సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి**

భూపాలపల్లి, మే22, ప్రభాతవార్త




ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సింగరేణి కార్మికుల సమిష్టి కృషి అవసరమని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టి డిపార్ట్‌మెంటల్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం భూపాలపల్లి ఏరియాలోని కేటికే ఓపెన్‌కాస్టు 03 గని ఆవరణలో జరిగిన కార్యక్రమంకు ముఖ్య అతిథిగా జీఎం రాజేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ దేశ పారిశ్రామికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, సంస్థ మరింత పురోగతి సాధించాలంటే ప్రతి ఉద్యోగి తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఉద్యోగుల సమిష్టి కృషి, సమయపాలన, క్రమశిక్షణ, అంకితభావం, సంస్థ విజయాలకు మూల స్థంబలాంటివని అన్నారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను రక్షణ సూత్రాలకు అనుగుణంగా సాధించాలని, ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణ , రక్షణ పాటించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మార్కెట్ పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా సింగరేణి రూపొందిస్తున్న ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయటంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని కోరారు. సంస్థ ప్రతిష్టను కాపాడుతూ నాణ్యత కలిగిన బొగ్గు ఉత్పత్తిని అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌ఓటుజీఎం ఎస్ కవీంద్ర, ఏజీఎం జోతి, కేటికే ఓసీపీ 3 ప్రాజెక్టు ఆఫీసర్ బిక్షమయ్య, ఏరియా ఇంజనీర్ రాజారావు, డీజీఎం రాజేశ్వర్, కృష్ణప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, గని మేనేజర్లు రాంబాబు, సునీల్, సంపత్, సంక్షేమాధికారి సాయికృష్ణ, ఏఐటియుసి, ఐఎన్‌టియుసి నాయకులు జి శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, సీఎంఓఏఐ ప్రతినిధి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయ పూర్వ వైభవం తిరిగి తీసుకరావాలి

**- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి**

ఎడ్యుకేషన్ కేయూ, మే 22 ప్రభాతవార్త :

పూర్వవిద్యార్థుల సమావేశాలతో విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది" అని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగంలో ఆ విభాగ 1978–80 బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ పూర్వవైభవాన్ని తిరిగి తీసుకురావడంలో అందరంకలిసి ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయులు-విద్యార్థుల మధ్య సత్సంబంధాలు ఉండటం అత్యంత అవసరమని తెలిపారు. విశ్వవిద్యాలయంలో సిలబస్‌లలో విస్తృత మార్పులు చేపడుతున్నామని, స్వర్ణోత్సవ వేడుకల తొలిసంవత్సరంలో అకాడమిక్ అభివృద్ధిపై, రెండవ సంవత్సరంలో మౌళికవసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని చెప్పారు. అలాగే నియామకాల ప్రక్రియపై కూడా శ్రద్ధపెట్టినట్లు వివరించారు. స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా పలుప్రణాళికలు రూపొందిస్తున్నామని, ముందుగా విభాగాల వారీగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించి, అనంతరం విశ్వవిద్యాలయ స్థాయి అలుమ్ని మీట్ నిర్వహించాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కే.వెంకటనారాయణ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం దేశానికి దిశానిర్దేశం చేసిన గొప్ప విద్యాసంస్థగా నిలిచిందన్నారు. విశ్వవిద్యాలయం స్మారక ఉపన్యాసాల రూపంలో మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. విశ్రాంత ఉద్యోగులు సంతృప్తికరమైన, ఆరోగ్యకరమైన జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎన్.విజయ, ఆచార్య ఎ.సదానందం పాల్గొన్నారు. విభాగాధిపతి ఆచార్య బి.సురేష్‌లాల్ విభాగ పురోగతిని వివరించి, భవిష్యత్తులో మరిన్ని పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆచార్య జి.భాస్కర్, ఆచార్య కనకాచారి తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి, తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కే.వెంకటనారాయణ, ఆచార్య ఎన్.విజయ, ఆచార్య ఎ.సదానందంను శాలువా, జ్ఞాపికతో అభినందించారు.




## మన్నెగూడెంలో ఈత, తాటి చెట్ల దగ్ధం

**గౌడ కుటుంబాల జీవనాధారంపై తీవ్ర ప్రభావం**

భీమారం, ప్రభాతవార్త:

మన్నెగూడెం గ్రామంలో వరుస అగ్ని ప్రమాదాలు గౌడ కులస్తుల జీవనాధారాన్ని దెబ్బతీశాయి. గ్రామంలో సుమారు 137 మంది గౌడ కుటుంబాలు సంప్రదాయ గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా, ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో వందలాది ఈత, తాటి చెట్లు దగ్ధమవడంతో వారు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో రైతులు పొలాల్లో మిగిలిన పంట అవశేషాలకు నిప్పు పెట్టే సమయంలో మంటలు అదుపుతప్పి చెట్లకు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించడం, గ్రామ సభలో తీర్మానాలు చేయడం, గ్రామ మైక్ ద్వారా రైతులకు హెచ్చరికలు జారీ చేయడం వంటి చర్యలు చేపట్టినా ప్రమాదాలు ఆగడం లేదని గౌడ కులస్తులు చెబుతున్నారు. గ్రామ చుట్టుపక్కల ఉన్న ప్రభురాయుడి కుంట సమీపంలో 150 ఈత చెట్లు, చెరువు వెనకాల మరో 100 ఈత చెట్లు, బోడ బిల్క్ ప్రాంతంలో 120 ఈత చెట్లు, గ్రామ సమీప తాటి వనంలో సుమారు 200 ఈత-తాటి చెట్లు, తంగేలా బోడ ప్రాంతంలో మరో 100 ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం మీద వందల సంఖ్యలో చెట్లు కాలిపోవడంతో గీత కార్మికుల ఉపాధికి తీవ్ర విఘాతం ఏర్పడింది. ఈత, తాటి చెట్లు గౌడ కుటుంబాలకు కేవలం చెట్లు మాత్రమే కాకుండా వారి ఆర్థిక బలమైన ఆధారం. ఒక్కో చెట్టు పెరగడానికి సంవత్సరాలు పట్టడం, వాటి ద్వారా వచ్చే ఆదాయంతోనే కుటుంబాలు జీవనం సాగించడం జరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో చెట్లు కాలిపోవడం వల్ల వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు వ్యవసాయ క్షేత్రాల్లో మంటలు వేయడంపై కట్టుదిట్టమైన నియంత్రణ అవసరమని, గ్రామ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే నష్టపోయిన గౌడ కుటుంబాలను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కాలిపోయిన ఈత-తాటి చెట్ల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## రెండో ఫోటో విధానాన్ని రద్దు చేయాలి

**ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ఉపాధి కూలీలు**

మొగుళ్లపల్లి,మే 22, ప్రభాత వార్త:



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజీఎస్) కూలీల హాజరు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో ఫోటో విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేస్తున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ఈ నిబంధన తమ ప్రాణాల మీదకు తెస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సాయంత్రం వరకు ఎండలోనే నిరీక్షణ.. ఈ సందర్భంగా కూలీల ప్రతినిధి దేవునూరి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నాయని, ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకోవడంతో పనులు చేసే ప్రదేశంలో నిమిషం కూడా నిలబడలేకపోతున్నామని వాపోయారు.ప్రతిరోజు రెండో ఫోటో దిగడానికి సాయంత్రం వరకు పనుల వద్దే వేచి ఉండాల్సి వస్తోందని కూలీలు తెలిపారు.ఇటీవల మండలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం వల్ల, మండుటెండల్లో అంతసేపు ఉండటం వల్ల కూలీలు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై సమీక్ష సమావేశం

**-గంజాయి, మాదకద్రవ్యాల నివారణకు చర్యలు తీసుకోవాలి**

**-జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**

**మహబూబాబాద్ టౌన్,మే22,ప్రభాతవార్త:**

జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల నివారణకై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పట్టణ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి విక్రయం, రవాణ, వినియోగంపై కఠిన నిఘా పెంచాలన్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారించాలని రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో పటిష్టమైన పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రతి పెట్రోలింగ్ అధికారి పాయింట్ బుక్స్‌ను సక్రమంగా నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కేసుల దర్యాప్తు వేగంతంగా పూర్తిచేసి నేరస్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో జరుగబోయే బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని అధికారులకు సూచించారు. మత




సామరస్యాన్ని కాపాడే విధంగా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారుల్లో చైతన్యం కల్పించాలని, ప్రజలను సరైన మార్గంలో నడిపించే బాధ్యత పోలీసులపై ఉందన్నారు. జిల్లాలో పోలీసులపై ప్రజలకు విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా బాధ్యతతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డిఎస్పిలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన యువత కోసం ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరం

**మరిపెడ,మే22,ప్రభాతవార్త:**



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మరిపెడ మున్సిపాలిటీ ఆడిటోరియంలో 15 నుండి 18సంవత్సరాల గల కౌమార బాలికల కోసం ప్రత్యేక ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరాన్ని డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో 55మంది బాలికలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారిలో కొందరిలో రక్తహీనత లక్షణాలను గుర్తించి ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తొర్రూరు డివిజన్ డిప్యూటీ డియంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, ముఖ్యంగా రుతుస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రమైన శానిటరీ ప్యాడ్ల వినియోగం వంటి అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పరిశుభ్రత, సరైన ఆహారపు అలవాట్లు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీకుమారి, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు సరిత, సౌజన్య, ఏఎన్ఎంలు నర్సబాయి, రూప్సీ, అశ్విని, శ్రీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గీసుగొండ మండలంలోని అన్ని గ్రామాల ప్రజల రక్షణ కొరకు "కాప్స్"అప్రమత్తత

**గీసుగొండ పోలీస్ ఇన్స్పెక్టర్**

**గీసుగొండ ప్రభాతవార్త.**




మండలంలో కొంతమంది సోషల్ మీడియాలో "కోటగండి మైసమ్మ టెంపుల్ - పోతురాజుపల్లి రోడ్‌లో బీహార్ వ్యక్తులు దాడులు" చేస్తున్నారు.అంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ప్రస్తుతం అలాంటి సంఘటనపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు మా దృష్టికి రాలేదు.మండల ప్రజలకు విజ్ఞప్తి దయచేసి వదంతులను నమ్మవద్దు, భయాందోళనలకు గురికావద్దు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే 100 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వండి.సోషల్ మీడియాలో నిర్ధారణ లేని వార్తలు పంపించడం వల్ల ప్రజల్లో అనవసర భయం, అపోహలు కలుగుతాయి. ఒకవేళ మీరు ఏదైనా ప్రత్యక్షంగా చూసినా లేదా ఎవరిపైన అయినా దాడి జరిగినట్లయిన పెడితే అర్థముంటుంది .కానీ ఊహించుకొని పెట్టడం సరి అయినది కాదు. అలా పెట్టడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురి అయ్యే అవకాశం ఉంది. కావున ప్రజలు ఇతర మిత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆధారాలు లేని వార్తలు పెట్టకూడదని విజ్ఞప్తి చేస్తున్నాము.గ్రామస్తుల భద్రత కోసం గీసుగొండ పోలీసులు రాత్రింబవళ్లు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని గీసుకొండ "ఎస్ హెచ్ ఓ" డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# పంట వ్యర్థాలను కాల్చొద్దు

**బయ్యారం,మే22,ప్రభాతవార్త:**



మండల వ్యాప్తంగా పంట కోతల తర్వాత మిగిలే మొక్కజొన్న సొప్ప, వరి గడ్డి వ్యర్థాలను పొలాల్లో కాల్చడం వలన తీవ్ర నష్టాలు జరుగుతాయని మండల పోలీస్, వ్యవసాయ శాఖ వారు తెలిపారు. పంట వ్యర్థాలు కాల్చడం వలన భూసారం దెబ్బతినడమే కాక భారీగా వచ్చే పొగ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో వీటిని కాల్చవద్దని, కాల్చితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్, వ్యవసాయ శాఖ వారు హెచ్చరిస్తున్నారు. పంట అవశేషాలు తగుల పెట్టడం వలన మట్టిలో నత్రజని, పాస్పరస్, పొటాష్ వంటి ముఖ్యమైన పోషకాలు, సూక్ష్మజీవులు పూర్తిగా నశించిపోతాయని, పొలాల నుండి వచ్చే దట్టమైన పొగ వలన పొలాలు ప్రధాన రహదారికి ప్రక్కనే ఉండడంతో రోడ్డు సరిగా కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిప్పుపెట్టడం చట్టరీత్యా నేరం అని వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన గాలి కలుషితమై ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందన్నారు. వ్యర్థాలను కాల్చడానికి బదులుగా రోటవేటర్, ఇతర పరికరాల సహాయంతో వాటిని భూమిలోనే కలియదున్నాలని దీని వలన భూమికి సహజ సేంద్రియ ఎరువు లభిస్తుందంటున్నారు.

**బయో-డికంపోజర్లు:**వ్యవసాయ అధికారులు సూచించే సూక్ష్మజీవుల ద్రావణాలను వాడటం ద్వారా గడ్డి త్వరగా కుళ్లిపోయి మంచి ఎరువుగా మారుతుంది. పంట అవశేషాల నిర్వహణపై మరింత సమాచారం కోసం మండల వ్యవసాయ అధికారిని, పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.

# అపారభక్తికి ప్రతీకగా భారీ విరాళం అందజేసిన శ్రీపతి శ్రీనివాస్

**మేడిపల్లి,ప్రభాతవార్త**

మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం అవుతున్న శ్రీ మార్కండేయ స్వామి దేవస్థానం నిర్మాణం కొరకు కట్లకుంట గ్రామానికి చెందిన శ్రీపతి శ్రీనివాస్ s/o గంగరాజు శుక్రవారం 1.25000(అక్షరాల ఒక లక్ష ఇరువై ఐదువేలు ) భారీ విరాళం అందజేసి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా వారి కుటుంబానికి ఉండాలని కోరుకుంటూ కుమారుడు హరికృష్ణ కు సన్మానం చేశారు..ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చేపూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బండారి రమేష్, ఉపాధ్యక్షులు కుందేన సత్యనారాయణ, కోశాధికారి మ్యాకల కిషోర్,సహాయ కార్యదర్శి పోతు అశోక్, సంఘ అధ్యక్షులు మ్యాకల రాజేశం, వజ్రలింగం, రవి ఆడెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..

మహబూబాబాద్ వార్త
మహబూబాబాద్, తొర్రూరు



# బయ్యారంలో శ్రమదాన కార్యక్రమం

**బయ్యారం,మే22,ప్రభాతవార్త:**



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా బయ్యారం మేజర్ గ్రామపంచాయతీలో పలు శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమాన్ని సర్పంచ్ గుగులోతు శాంతికిషన్ నాయక్ స్వయంగా చెత్త ఊడ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుద్య కార్మికులతో పాటు సర్పంచ్ వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యాధికారి విజయ్‌కుమార్, ఎంఈవో లక్ష్మణ్‌రావు, పంచాయతీ సిబ్బంది ఒక రోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా స్వయంగా రోడ్లను ఊడ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని సర్పంచ్ శాంతికిషన్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాంబాబు, ఎంపీవో చంద్రమోహన్, నాల్గవ వార్డు సభ్యులు కల్పన, కలింగరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామాంతపూర్ పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

**మహబూబాబాద్ రూరల్,మే22,ప్రభాతవార్త:**



హైదరాబాద్‌లోని రామాంతపూర్ పబ్లిక్‌స్కూల్‌లో ఒకటవ తరగతిలో ప్రవేశానికి ఐటిడిఏ ఆధ్వర్యంలో విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దేశీరాం తెలిపారు. ఈ సందర్భంగా 34మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకోగా అందులో ఆరుగురిని లాటరీ పద్ధతిని ఎంపిక చేయాల్సి ఉండగా కోయ ఉపకులానికి కేటాయించిన రెండు సీట్లకు గాను ఒక్కరు మాత్రమే ధరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఐదుగురు విద్యార్థులను జిల్లాస్థాయి ఎంపిక లాటరీ పద్ధతిని ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో నలుగురు లంబాడ ఉప కులానికి చెందగా, ఒక్కరు కోయ ఉపకులానికి చెందిన వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, కోటేశ్వరి, సత్రు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అర్థశాస్త్ర విభాగంలో సుస్మితకు డాక్టరేట్

**ఎడ్యుకేషన్ కేయూ, మే 22 ప్రభాతవార్త :**



కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగపు పరిశోధకురాలు సుస్మిత చెగ్గంకు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ సుస్మిత " లివింగ్ కండిషన్స్ ఆఫ్ ఫిషర్ మెన్ స్టడీ" అనే పరిశోధన గ్రంథాన్ని అర్థశాస్త్ర విభాగపు రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ స్వరూపరాణి పర్యవేక్షణలో పూర్తిచేశారు. డాక్టర్ సుష్మిత ప్రస్తుతం గవర్నమెంట్ డిగ్రీకళాశాల రంగసాయిపేట్ అర్థశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. డాక్టర్ సుష్మితను అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

# హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్స్‌లో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ

**ఆరోగ్యకరమైన కణాలకు హాని లేకుండా రేడియేషన్ థెరపీ**

**క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు**

**హన్మకొండ ప్రెస్ మీట్‌లో యశోదా హాస్పిటల్స్ వైద్య నిపుణులు వెల్లడి**

*మే 22, ప్రభాతవార్త, హనుమకొండ టౌన్ :*

క్యాన్సర్ చికిత్సా రంగంలో వస్తున్న సాంకేతిక ఆవిష్కరణలు రోగులకు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయని యశోదా హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) నిపుణులు వెల్లడించారు. ముఖ్యంగా రోబోటిక్ సర్జరీ, “ఎంఆర్ లినాక్“ రేడియేషన్ టెక్నాలజీలు క్యాన్సర్ వైద్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. శుక్రవారం హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ రేడియేషన్ ఆంకాలజీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత, రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఇ. రాజేష్ గౌడ్ ఈ అత్యాధునిక చికిత్సా విధానాల వివరాలను వెల్లడించారు.

**8 ఎంఎం చిన్న రంధ్రాలతోనే రోబోటిక్ సర్జరీ :**

గతంలో లాగా పెద్ద కోతలు లేకుండా, కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా హైడెఫినిషన్ 3డి విజన్, మనిషి చేతి కదలికలను అనుకరించే ‌ట్రిస్టెడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ సాయంతో క్లిష్టమైన ఆపరేషన్లను అత్యంత ఖచ్చితత్వంతో చేయవచ్చని డాక్టర్ రాజేష్ గౌడ్ తెలిపారు.

మహిళల క్యాన్సర్లు : గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో ఖిరాడికల్ హిస్టరెక్టమీఖి వంటి సర్జరీలను సురక్షి తంగా చేయవచ్చును. దీనివల్ల గతంలో 4-5 రోజులు ఉండాల్సిన హాస్పిటల్ స్టే, ఇప్పుడు ఖచ్చితంగా 24 గంటలకే పరిమితమైంది.

**యూరాలజీ, కిడ్నీ క్యాన్సర్లు :**

ప్రోస్టేట్, బ్లాడర్ క్యాన్సర్లలో నరాలు దెబ్బతినకుండా కాపాడటం ద్వారా రోగి జీవన నాణ్యత మెరుగవుతుంది. కిడ్నీ క్యాన్సర్లలో పూర్తి కిడ్నీ తీసేయకుండా కేవలం ట్యూమర్ను మాత్రమే తొలగించే సదుపాయాలు లభిస్తుంది. మంచి ప్రయోజనాలతో పాటు తక్కువ నొప్పి తక్కువ రక్త నష్టం చిన్న మచ్చలు ఏర్పడటంతో పాటు రోగులు అత్యంత వేగంగా కోలుకొని తమ పనుల్లో చేరిపోవచ్చునని అన్నారు. కోలోరెక్టల్ క్యాన్సర్ చికిత్సలో స్మార్ట్ సాంకేతికత కోలో రెక్టాల్ క్యాన్సర్లలో కూడా ఈ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చిందని వైద్యులు తెలిపారు. ట్యూమర్ ను కచ్చితంగా గుర్తించి తొలగించడం వల్ల చాలా సార్లు రోగులకు పర్మినెంట్ కోలోస్టమి అవసరం లేకుండానే చేయగలుగుతున్నామని వివరించారు ఇందులో వాడే స్మార్ట్ స్టాప్లర్ టెక్నాలజీ ద్వారా పేగు చివరాలను మరింత సురక్షి తంగా కలపవచ్చని దీనివల్ల లీకేజీ ప్రమాదం తప్పుతుందని పేర్కొన్నారు. అలాగే మెరుగైన నాడుల రక్షణ వలన యూరినరీ, సెక్సువల్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ కూడా బాగుంటుందని వెల్లడించారు. సరికొత్త యుగం ఎం ఆర్ లినాక్ అని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎం సునీత అన్నారు. రేడియేషన్ అనగానే రోగుల్లో ఉండే సైడ్ ఎఫెక్ట్స్ భయాలను దూరం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో ఎం.ఆర్ లినాక్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు ప్రత్యేకత తో ఒకే మిషన్ లో ఎంఆర్ఐ స్కాన్ లినియర్ ఆక్సిలేటర్ కలిసి పని చేస్తాయి అని అన్నారు. ప్రతిరోజు రేడియేషన్ ఇచ్చే ముందు రోగికి ఆటోమేటిక్గా ఎమ్మారై స్కాన్ జరిగి హ్యూమర్ సైజు స్థానాన్ని బట్టి మిల్లీమీటర్ స్థాయిలో కచ్చితంగా రేడియేషన్ ఇస్తారు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు పక్కన ఉండే ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి హాని జరగదు అని అన్నారు. సాధారణ రేడియేషన్లో వచ్చే వాంతులు, అలసట, చర్మ సమస్యలు ఇందులో ఉండవని అన్నారు. తక్కువ కాలంలో చికిత్స ప్రోస్టేట్, బ్రెయిన్, లంగ్, ప్యాంక్రియాస్ వంటి కష్టమైన క్యాన్సర్లకు కొన్ని సందర్భాల్లో కేవలం ఐదు రోజుల్లోనే చికిత్స పూర్తవుతుందని అన్నారు. ఈ అత్యాధునిక సాంకేతికతలు క్యాన్సర్ రోగులకు ఆర్థిక శారీరిక మానసిక ఒత్తిడి తగ్గించి మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ టీం లీడర్ సాయి వెంకట, డిప్యూటీ మేనేజర్ విజయకుమార్ణ, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం తరలింపులో జాప్యం తగదు

*నెల్లికుదురు మే 22 ప్రభాతవార్త :*

మండలంలోని వివిధ గ్రామాలలో మార్క్ ఫెడ్, ఐకెపి, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం



తరలింపులో సంబంధిత అధికారులు జాప్యం చేయడం తగదని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు చందు రాజు అన్నారు శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బాబురావుకు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గుట్టలుగా పడి ఉన్న ధాన్యం తోపాటు మొక్కజొన్నలు త్వరితగతిన కాంటాలు నిర్వహించడమే కాకుండా వీలైనంత తొందరగా వాటిని మిల్లులకు స్టాక్ పాయింట్లకు తరలించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ సందర్భంగా ఆయన వెంట యాకి రెడ్డి, తోట రమేష్, సుందర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు

# అనుమతులు లేకుండా నడుస్తున్న రేసోనేన్స్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**.రేసోనేన్స్ కళాశాలలపై చర్యలు తీసుకోకపోవడానికి గల ఆంతర్యం ఏమిటి...?**

**డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కన్వినర్ ఉప్పుల శివ**

*మే 22, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :*

శుక్రవారం హన్మకొండ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రేసోనేన్స్ జూనియర్ కళాశాలల పైన చర్యలు



తీసుకోవాలని హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కి వినతిపత్రం అందజేయడం జరిగింది అని డీఎస్ఓ కన్వీనర్ ఉప్పల శివ అన్నారు. ఈ సందర్భంగా ఉప్పుల శివ మాట్లాడుతూ రేసోనేన్స్ కళాశాలలు ప్రభుత్వ నియమనిబంధలకు విరుద్ధంగా కళాశాలలు నడిపిస్తూ, విద్యను వ్యాపారంగా మారుస్తూ అధిక లాభార్జనే ధ్యేయంగా ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ అలాగే ఇంటర్ బోర్డు వద్ద పర్మిషన్ లేకుండా బ్రాంచిలను నడిపిస్తున్నారని అలాంటి బ్రాంచిలపై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జాషువా,శేషిదర్ పాల్గొన్నారు.

## వెళ్లి వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు అదృశ్యం

*ఆత్మకూరు ప్రభాతవార్త మే 22,*

ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగమడుగుపల్లి గ్రామంలో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన గుమ్మడి మహేష్ తన మామ జంగిలి ఐలయ్య (63) కనిపించడం లేదంటూ ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 11వ తేదీన ఉదయం సుమారు 5 గంటల సమయంలో లింగమడుగుపల్లి గ్రామానికి చెందిన జంగిలి ఐలయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి త్వరలో తిరిగి వస్తానని చెప్పి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అప్పటి నుంచి ఆయన తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పరిసర గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి సమాచారం లభించలేదు. ఫోన్ ద్వారా బంధువులను సంప్రదించినప్పటికీ ఆచూకీ దొరకలేదని పేర్కొన్నారు. గతంలో కూడా ఐలయ్య రెండు సార్లు ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లి 3 నుంచి 4 రోజుల తర్వాత తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈసారి కూడా తిరిగి వస్తాడని భావించి కొంతకాలం వేచిచూసినా ఎలాంటి సమాచారం రాకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఐలయ్య నీలం రంగు లుంగీ, నీలం గీతలతో ఉన్న తెలుపు రంగు చొక్కా ధరించి, నీలం రంగు తువాలు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. ఆయన నలుపు వర్ణం, సుమారు 4.8 అడుగుల ఎత్తు, తెల్ల జుట్టుతో ఉంటారని తెలిపారు.

# తొర్రూరు వార్త

## కిశోర బాలికలకు చట్టాలు, ఆరోగ్యంపై అవగాహన

**తప్పనిసరి బాలికల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఇనుగుర్తిలో అవగాహన సదస్సు**

*ఇనుగుర్తి, మే 22, ప్రభాతవార్త:*

11 నుంచి 18 ఏళ్ల లోపు వయసున్న కిశోర బాలికలు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సీసీ వెంకటేశ్వర్లు సూచించారు. ఇనుగుర్తి మండల



కేంద్రంలో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో కిశోర బాలికల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బాలికల సమగ్ర వికాసానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని, సమాజంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బాలల హక్కులు, రక్షణ చట్టాలు, ముఖ్యంగా లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోక్సో) తదితర కీలక అంశాలపై విద్యార్థినులు కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో బాలికలు శారీరకంగా, మానసికంగా ఎదిగి ధైర్యంగా ముందుకు సాగడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పొన్నం కవిత, సీఏలు బోళ్ల అశోక్, కంచనపల్లి వెంకన్న, కుంచాల సులోచన, శ్రీరాం జయలక్ష్మి ్ర, ఆశా కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రమాద వశత్తు ఫామ్‌అయిల్ తోటకు నిప్పు

*నెల్లికుదురు మే 22 ప్రభాతవార్త :*

మండలం లోని బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామంలో రైతులు తాళ్ల రాంరెడ్డి, తాళ్ల ప్రభాకర్ రెడ్డి లకి చెందిన పామాయిల్ తోటలో ప్రమాద వశత్తు మంటలు చెలరేగి సుమారు 50 మొక్కలకు నిప్పు అంటుకొని కాలిపోయిన సంఘటన శుక్రవారం జరిగింది బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించటం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చు అని అన్నారు అగ్నిమాపకవాహనానికి సమాచారం ఇచ్చామని వారు వచ్చేలోపు సమయానికి విద్యుత్ అధికారులు లైన్మెన్ జాటోత్ మంగీలాల్, జేఎల్ఎం ప్రవీణ్ కుమార్ స్పందించి మూడో ఫేస్ కరెంటు ఇవ్వడం వలన మోటార్ల ద్వారా మంటలు ఆర్పి పెద్ద మొత్తంగా నష్టం జరగకుండా పామాయిల్ తోటను కాపాడుకోవడం జరిగిందని అన్నారు విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు



# కార్మికుల వేతనాల పెంపులో పారదర్శకత లేదు

**పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా పెంపు లేదు**

**3 లక్షలుకు పైగా ఉన్న స్కీమ్ వర్కర్లు ను ఏ కేటగిరిలోకి తీసుకొస్తారో స్పష్టత లేదు**

**శ్రీ దాస్యం వినయ్ భాస్కర్ గారు**

*మే 22, ప్రభాతవార్త , హన్మకొండ టౌన్ :*

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన వేతనాల పెంపులో శాస్త్రీయత లేదని పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగలేదని శ్రీ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కార్మికులుకార్మిక సంఘాలు చేసిన డిమాండ్లను పట్టించుకోకుండా వేతన పెంపుదల కోసం క్యాబినెట్ సబ్ కమిటీ వేశామని దేశానికి ఆదర్శంగా ఉండేలా శాస్త్రీయ పద్ధతిలో కనీస వేతనాల పెంపుదల చేస్తామని సీఎం ప్రకటించి ఆచరణలో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. కనీస వేతనాల పెంపుదల సందర్భంగా కరువు భత్యం గురించి ప్రస్తావించకపోవడం దారుణమని పెరిగిన వేతనాలు నాలుగు కేటగిరీలలో అన్ స్కిల్డ్ వర్కర్లకు 16000/, సెమీస్కిల్ వర్కర్లకు 17000/, స్కిల్ వర్కర్లకు 18500/, హై స్కిల్డ్ వర్కర్లకు 20000/ పెంచినట్లు సీఎం ప్రకటించారు. ఇందులో ఒక్క అన్ స్కిల్డ్ వర్కర్ల తప్ప మిగతా వారికి బేసిక్ కరువు బత్యం కలుపుకొని ఇప్పటికే వస్తున్న జీతానికి, పెరిగిన దానికి పెద్ద తేడా లేదని తెలిపారు కాంట్రాక్టు లేబర్ జీవో 11 ప్రకారం ఇప్పటికే రాష్ట్రంలో కార్మికులకు 13098 నుంచి 23,683 వరకు వేతనాలు పొందుతున్నారని దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వం పెంచింది పెద్దగా ఏమీ లేదని విమర్శించారు జీవో నాలుగులో స్కిల్డ్ కార్మికునికి 19572 ఉండగా సీఎం ప్రకటించిన వేతనం 18,500 మాత్రమేనని గతంతో పోలిస్తే 1072 రూపాయల తగ్గిందని తెలిపారు. బి ఆర్ ఎస్ అధికారంలో ఉండగా కనీస వేతనాల సలహా మండలి బోర్డు అన్ స్కిల్డ్ కార్మికుడికి కనీస వేతనం 18009 రూపాయలు కరువుభాత్యాన్ని ఒక్కొక్క పాయింట్ కు 12 రూపాయలు సిఫార్సు చేశారని గుర్తు చేశారు దీనితోపాటు 2021 జూన్



25న బిఆర్ఎస్ ప్రభుత్వం ఐదు జీవోలను జారీ చేసిందని వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. గత కేసిఆర్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనం నెలకు 14,600 నుండి 22 వేలుగా ఉంది. ఇప్పుడు వేతనాల పెంపు విషయంలో ఏ ప్రమాణికాన్ని కూడా పరిగణలోకి తీసుకోలేదని విమర్శించారు. కార్మిక సంఘాలు కనీస వేతన సలహా మండలి బోర్డు సిఫార్సులను కూడా పరిగణలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉప సంఘం పేరిట కనీస వేతనాలు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. 1948 కనీస వేతన చట్టం ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా డాక్టర్ అక్రాయ్ ఫార్ములా ప్రకారం శాస్త్రీయంగా లెక్కగడితే కనీస వేతనం నెలకు 32, 000వేలు ఇవ్వాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఒకవైపు చెబుతున్న దేశంలో ఉన్న కార్మిక సంఘాలు కలిసివేత్నన 26 వేలైన ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న, సీఎం రేవంత్ రెడ్డి పెడచెవిన పెట్టారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కనీస వేతనం 24000 ఇస్తామని ప్రకటించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చాడు అని అన్నారు. రాష్ట్రంలో స్కీం వర్కర్లుగా అంగన్వాడి, ఆశ, ఎన్ఆర్ఈజీఎస్, సర్వ శిక్ష అభియాన్ కింద మూడు లక్షల పైన కార్మికులు పనిచేస్తున్నారని మీరు ఏ కేటగిరి కిందికి వస్తారో స్పష్టత లేదని, ప్రస్తుతం అమల్లో ఉన్న వేతనాల కంటే కూడా తక్కువగా ఉన్న వేతన సవరణలు కూడా సమీక్షి ంచాలని డిమాండ్ చేశారు.




## ఐకెపి వివోఏల సమ్మె

*గూడూరు, మే 22, ప్రభాతవార్త*

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఐకెపి వివోఏల నిరవధిక సమ్మెలో



భాగంగా గూడూరు మండలంలోని వివోఏలు కూడా శుక్రవారం నుండి సమ్మె బాట పట్టారు. ఈ మేరకు తొలుత ఇంచార్జ్ ఎంపీడీవో పృథ్వీరాజ్ కు సమ్మె నోటీసు అందజేసిన వివోఏలు మండల పరిషత్ కార్యాలయంలో టెంటు వేసి బైఠాయించారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు ఎం శ్రీలత, కార్యదర్శి కె యాకయ్య, కోశాధికారి శారద, పద్మ, శారద, భారతి, సుజాత, ఈశ్వరి, వసంత, సుగుణ, రాములు, కళ్యాణ్, రాజు, లక్ష్మణ్ మొదటి రోజు సమ్మె శిబిరంలో పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మహేంద్రుడు

## ప్రాణాపాయంలో దంపతులను కాపాడిన పోలీస్

*హసన్ పర్తి, 22, ప్రభాతవార్త.*

పోలీస్ అంటే దొంగలను, క్రిమినల్స్ ను, రౌడీలను పట్టుకోవడమే పనిగా పెట్టుకుంటారని ఎవరినడిగినా తడుముకోకుండా చెప్పే సమాధానము. కానీ హసన్ పర్తి పోలీస్ స్టేషన్లో సిఐగా పనిచేస్తున్న ఆకునూరి మహేందర్ కాఖీల డ్రెస్ వెనక నిగూఢమై ఉన్న మానవత్వాన్ని చాటుకున్న సందర్భం పలువురి ప్రశంసలను పొందుతుంది. వివరాల్లోకి వెళితేగుంటూరుపల్లి గ్రామపంచాయతీలో రైతులతో నిర్వహించిన సమావేశాన్ని ముగించుకుని హసన్‌పర్తి సీఐ మహేందర్ తిరిగి వస్తుండగా ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్డు) సమీపంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఏనుమాముల మార్కెట్‌కు వెళ్లి మిర్చి తీసుకుని ఎక్సెల్ ద్విచక్రవాహనంపై గుంటూరుపల్లికి తిరిగి పయనం అయిన మడిపల్లి పద్మ, వెంకటస్వామి దంపతులకు ఊహించని ప్రమాదం ఎదురైంది. బండి వెళ్తున్న సమయంలో పద్మ కట్టుకున్న చీర అకస్మాత్తుగా వెనుక చక్రంలో ఇరుక్కుపోవడంతో అదుపుతప్పిన వాహనం నుంచి దంపతులిద్దరూ ఒక్కసారిగా రోడ్డుపై కిందపడిపోయి గాయపడ్డారు. సరిగ్గా అదే దారిలో వెళ్తున్న సీఐ మహేందర్ విలవిల్లాడుతున్న దంపతులను గమనించి క్షణం కూడా ఆలోచించకుండా తక్షణమే స్పందించారు. రోడ్డుపై ఉన్న క్షతగాత్రులను వెంటనే స్వయంగా తన పోలీసు వాహనంలోకి ఎక్కించుకుని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా హసన్‌పర్తి ఆసుపత్రికి తరలించి వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూశారు. నిత్యం నేరస్తుల భరతం పట్టే కఠినమైన ఖాకీ దుస్తుల వెనుక దాగి ఉన్న అంతులేని మానవత్వాన్ని, సామాజిక బాధ్యతను కళ్లకు కట్టిన ఈ ఘటన ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతగా నిలిచిన పోలీసుల సమయస్ఫూర్తిని, సేవాతత్పరతను చూసి యువతతో పాటు వృద్ధులు సైతం సలాం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వ్యక్తుల పట్ల మానవత్వాన్ని చాటుకున్న మహేంద్రుడికి మండల వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి



## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి సాయం

*కేసముద్రం, మే 22, ప్రభాతవార్త*

కేసముద్రం మున్సిపాలిటీలోని అమీనాపురం ఎస్సీ కాలనీకి చెందిన



సీనియర్ ఫోటోగ్రాఫర్ ఇనుముల కర్ణాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను సమ్మె గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. భవిష్యత్ లో కరుణాకర్ పిల్లల చదువుల కోసం అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు శ్రీను, కల్లెం శ్రీను, జన్ను కట్టయ్య, చంటి, శరత్, భాస్కర్, కరుణాకర్, శ్యామ్, అనిల్, కృష్ణ, రాజేందర్ కుమార్, అభిలాష్, సుశీల, యాకమ్మ, స్వర్ణలత, రమ, సరిత, బుజ్జమ్మ పాల్గొన్నారు.

# ఎంజీబీఎస్ బస్సుల తాత్కాలిక రూట్ మార్పు

## ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ ఎస్. భవాని ప్రసాద్

*మే 22, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :*

ఉప్పల్ క్రాస్ రోడ్డు వద్ద ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కారణంగా హన్మకొండ ఎం జి బి ఎస్ బస్సుల తాత్కాలిక రూట్ మార్పు జరుగుతుందని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ ఎస్ భవాని ప్రసాద్ అన్నారు.హన్మకొండ నుండి హైదరాబాద్ ( ఎంజీబీఎస్) వైపు ప్రయాణించే ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఉప్పల్ క్రాస్ రోడ్డు వద్ద ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు జరుగుతున్నందున, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా బస్సుల సర్వీసుల మార్గాలను తాత్కాలికంగా మారుస్తున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ ఎస్. భవాని ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చబడిన ప్రయాణ మార్గాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:1. హన్మకొండ నుండి హైదరాబాద్ వెళ్లే మార్గం:రాజధాని, సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు హన్మకొండ నుండి బయలుదేరి ఘట్‌కేసర్, చెంగిచెర్ల, నల్లచెరువు, భగాయత్, నాగోల్, ఉప్పల్ శ్రీ రోడ్, రామంతపూర్ మీదుగా నేరుగా ఎంజీబీఎస్ వరకు వెళ్తాయి.2. హైదరాబాద్ (ఎంజీబీఎస్) నుండి హన్మకొండ తిరుగు ప్రయాణంలో బస్సులు ఎంజీబీఎస్ నుండి బయలుదేరిచే నెంబర్ (6 నెంబర్), ఉప్పల్ శ్రీ రోడ్, పిస్తా హౌస్, చిల్కానగర్,



నల్లచెరువు మీదుగా హన్మకొండకు నడపబడతాయి.3.ఎక్స్‌ప్రెస్ బస్సులు హన్మకొండ నుండి ఉప్పల్ నల్లచెరువు వరకు మాత్రమే నడపబడుతున్నాయని అన్నారు..ప్రయాణికులకు విజ్ఞప్తి:రోడ్డు నిర్మాణ పనుల దృష్ట్యా ప్రయాణికులు ఈ తాత్కాలిక మార్పును గమనించి, సురక్షి త ప్రయాణానికి సహకరించవలసిందిగా కోరడమైనది.

# కొయ్యకాళ్ల మంటలకు 150 తాటి చెట్లు బుగ్గి

## గీత కార్మికులకు తీరని శోకం...

*కమలాపూర్: ప్రభాతవార్త.*

హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండల కేంద్ర శివారులో గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో వరి కొయ్యకాళ్లకు నిప్పు పెట్టడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గాలుల తీవ్రతకు మంటలు క్రమంగా వ్యాపించి పక్కనే ఉన్న తాటి వనాన్ని చుట్టుముట్టాయి.ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 150 కల్లు పారే తాటి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా తాటి వనం కాలిపోవడంతో ఆ చెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గీతా కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. రోజూ కల్లు గీసుకొని కుటుంబాలను పోషించుకునే వారికి ఈ ఘటన పిడుగులా మారింది. తమ జీవనాధారమైన తాటి చెట్లన్నీ కాలి బూడిద కుప్పలుగా మారడంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. "ఇక మా బతుకు ఎలా? పిల్లలకు తిండి ఎలా పెట్టాలి?" అంటూ గీతా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరి నిరక్ష ్యం వల్ల పదుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని



వాపోయారు.వరి కొయ్యకాళ్లకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి హానితో పాటు ఇలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగుతున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు మరోసారి హెచ్చరించారు. బాధిత గీతా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# విజయవంతంగా కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాలు

**-మత్తుపదార్థాల నివారణలో**

**ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలి**

**-జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్**



**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:**

మత్తుపదార్దాలు, బాల్యవివాహాల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ అన్నారు. శుక్రవారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానిక పిఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చేరువగా పాలన అందించడానికి క్షేత్రస్థాయిలో పాలనను అందిస్తూ ప్రజలకు సామాజిక, న్యాయ, ఆర్థిక సాధికారిక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సేవలు అందిస్తుందన్నారు. పెన్షన్ కోసం ధరఖాస్తు చేసుకున్న వారి ధరఖాస్తులు డిజిటలైజేషన్ చేసి సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం నుండి ఆదేశాలు జారీకాగానే మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిలో జిల్లా రాష్ట్రంలో ఆరవస్థానంలో ఉందని, మిగిలిన లక్ష్యాలను పూర్తిచేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. స్వీయ గణన, ఇండ్ల గణన సర్వేలు జిల్లా ప్రణాళిక ప్రకారం సర్వే కొనసాగుతుందని ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా తమ వివరాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలని ఇతర వాణిజ్య పంటలు పామాయిల్, పప్పుదినుసులు, సేంద్రియ వ్యవసాయం, ఎరువులు, సెరికల్చర్ తదితర పంటలపై అధిక లాభాలు వస్తాయని రైతులకు సూచించారు. యూరియా అధిక వాడకం వలన భూమి సారవంతం కోల్పోయి రైతులకు నష్టం కలుగుతుందని నానో యూరియా, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. బాల్య వివాహాల నివారణకు జిల్లా స్పెషల్ టీం ప్రత్యేక నిఘా పెట్టిందని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో నిరుద్యోగం పెరిగిపోయిందని ప్రతి ఒక్కరికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా జిల్లాలో సుమారు 6వేల మంది నిరుద్యోగులు తమ ధరఖాస్తులను ఉపాధి కల్పన అధికారి వద్ద నమోదు చేసుకున్నట్లు తెలిపారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలో 562కోట్ల 11 లక్షల 6వేల 931మందికి, మెప్మా 97కోట్ల 33లక్షల 48వేల 609 సంఘాలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, సన్నవడ్లకు బోనస్ చేయూత పథకం, కళ్యాణ లక్ష్మి, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరెల పంపిణీ, రేషన్‌కార్డు, తదితర ఆరు గ్యారెంటీలకు పథకాల అమలుతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియెట్ వరకు పొడగింపు తదితర సౌకర్యాలు అందించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా మార్చి 6నుండి 15వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ క్లియరెన్స్, ఏప్రిల్ 6 నుండి 11వరకు వయోవృద్ధులు, దివ్యాంగులు, బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, ఏప్రిల్ 20నుండి25వరకు సంక్షేమ కార్యక్రమాల అవగాహన, ఏప్రిల్ 27 నుండి మే 2వరకు మత్తు పదార్థాల నివారణ, బాల్యవివాహాలు నిర్మూలించడం తదితర కార్యక్రమాలు, మే 4 నుండి 9వరకు రైతు సంక్షేమ వారోత్సవాలు, మే11నుండి16వరకు విద్యా వారోత్సవాలు, మే 18నుండి 23వరకు యువత క్రీడోత్సవం, మే 25నుండి 30వరకు మహిళలకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు పొదుపు చర్యలపై అవగాహన, జూన్ 1 నుండి 12వరకు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాల విజయానికై జిల్లా అధికారులకు ఇప్పటికే పూర్తి బాధ్యతలు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధనపు కలెక్టర్ అనిల్‌కుమార్, ఇంచార్జ్ అధనపు కలెక్టర్ పురుషోత్తం, ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్, డిఎస్పి తిరుపతిరావు, మధుసూదనరాజు, ఆయా మున్సిపాలిటిల చైర్మన్‌లు, అన్ని విభాగాల అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడివోలు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో వైభవంగా సరస్వతి అంత్య పుష్కరాలు

**భక్తుల కోసం సరస్వతి నవరత్నమాల హారతి ప్రత్యక్ష ప్రసారం**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడి**

**మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త**



త్రివేణి సంగమ క్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కర వేడుకలు కనుల పండువగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం నది తీరాన అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతి నవరత్నమాల హారతి కార్యక్రమాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, దేశవిదేశాల్లో ఉన్న భక్తులందరూ ఈ మహాద్భుత ఘట్టాన్ని వీక్షి ంచేలా ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు రాత్రి 7.30 గంటల నుండి ఈ ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ వివరించారు. కాశీ పండితులచే హారతి సేవలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాశీలో అత్యంత ప్రజాదరణ పొందిన గంగా హారతిని ఇచ్చే నిపుణులైన పండితుల చేతనే ఇక్కడి సరస్వతి నవరత్నమాల హారతిని కూడా ఇప్పించేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ తెలిపారు. దాదాపు 45 నిమిషాల పాటు సాగే ఈ ఆధ్యాత్మిక వేడుకలో భాగంగా కాశీ పండితులు తొమ్మిది రకాల ప్రత్యేక హారతులను సమర్పిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ పరమ పవిత్రమైన నవరత్నమాల హారతి దృశ్యాలను భక్తులందరూ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షి ంచి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు.

# రెండవ రోజుకు చేరిన అంత్య పుష్కర సంబరాలు

**నదీ తీరాలకు భక్తజన నదీ స్నానాలు**

**పిండ ప్రదానాలతో కిక్కిరిసిన ఘాట్లు**

**ఆధ్యాత్మిక శోభతో పులకించిన పుణ్యక్షేత్రాలు**



**మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త**



అంత్య పుష్కరాల రెండవ రోజున నదీ తీరాలు భక్తుల కోలాహలంతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర నదీ స్నానాలు ఆచరించి, సంప్రదాయ మునకలు వేశారు. పూర్వీకుల ఆత్మశాంతి కోసం ఘాట్ల వద్ద పెద్ద ఎత్తున పిండ ప్రదానాలు, తర్పణ లు కార్యక్రమా నిర్వహించారు. నదీ మాతకు ప్రత్యేక హారతు లు, దీపారాధనలు, పూజా కార్యక్రమాలతో తీర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అంత్య పుష్కర వేడుకలు రెండవ రోజు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో కొనసాగాయి. పుష్కరాల ముగింపు ఘట్టం కావడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు నదీ తీరాలకు భారీగా తరలివచ్చారు. దీంతో అన్ని ప్రధాన పుష్కర ఘాట్లు భక్తుల కోలాహలంతో, మంత్రోచ్చారణలతో మార్మోగాయి .తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తుల తాకిడి ప్రారంభమైంది. నదిలో పవిత్ర మునకలు వేసిన అనంతరం, భక్తులు తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు మరియు తర్ప ణాలు సమర్పిం చారు. ఘాట్ల వద్ద బ్రాహ్మ ణులు, పురోహి తుల ఆధ్వర్యంలో ఈ శాస్త్రోక్త కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. తీరంలోని ఆలయాలన్నీ భక్తుల దర్శనాలతో కిక్కిరిసిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఘాట్ల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. తాగునీరు, నీడ వసతి, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ నదీ మాతకు నిర్వహించిన హారతి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేలాదిగా తరలివచ్చిన జనంతో అంత్య పుష్కరాల రెండవ రోజు విజయవంతంగా ముగిసింది.



# రానున్న మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

**వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్**

**ప్రజలకు కలెక్టర్ రాహుల్ శర్మ కీలక సూచనలు**

**అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు**

**చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్త**

**మహాదేవపూర్, మే 22, ప్రభాతవార్త**

జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు ఎండల తీవ్రత విపరీతంగా పెరగనుందని, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ మేరకు వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలెర్ట్ హెచ్చరికలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. తీవ్రమైన ఎండదెబ్బ (వడదెబ్బ) బారిన పడకుండా ప్రజలు తమను తాము రక్షి ంచుకోవడానికి అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకు రావాలి ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలను పూర్తిగా నివారించాలని కలెక్టర్ కోరారు. కేవలం ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఇండ్ల నుండి బయటకు రావాలని, అత్యవసర పనులు ఉంటే తప్ప మధ్యాహ్న సమయాల్లో ప్రయాణాలు వాయిదా వేసుకోవడం ఉత్తమమని స్పష్టం చేశారు. సమృద్ధిగా తాగునీరు: దాహం వేయకపోయినా సరే నిరంతరం నీరు, మజ్జిగ, కొబ్బరిబొండాల వంటి ద్రవాహారం తీసుకోవాలన్నారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు వీలుగా వదులుగా ఉండే కాటన్ (నూలు) దుస్తులను ధరించాలని,రక్షణ కవచాలు అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ ధరించడం లేదా తెల్లటి కాటన్ గుడ్డతో తల, ముఖం కప్పుకోవడం చేయాలన్నారు. గొడుగును తప్పనిసరిగా వాడాలి. చిన్నపిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధవయసు మళ్లిన వారు, చిన్నపిల్లలు ఎండ తీవ్రతకు త్వరగా అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. కుటుంబ సభ్యులు వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఎవరికైనా నీరసం, తల తిరగడం, వాంతులు కావడం వంటి వడదెబ్బ లక్షణాలు లేదా అస్వస్థత అనిపించిన వెంటనే ఏమాత్రం నిర్లక్ష ్యం చేయకుండా సమీపంలోని వైద్య సిబ్బందిని లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి తక్షణమే వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు.